ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 76 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 22 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 76 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 22 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## చంద్రబాబు కుప్పం వాసుల దశాబ్దాల కల నెరవేర్చారు

- కరవు రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే చంద్రబాబు ధ్యేయమన్న భువనేశ్వరి
- కుప్పానికి కృష్ణా జలాలు తెచ్చి దశాబ్దాల కలను నిజం చేశారని వెల్లడి
- మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపు
- కుప్పం పర్యటనలో భాగంగా తుమ్మిసి చెరువు వద్ద కృష్ణమ్మకు జలహారతి



ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు.



వివరాలు 2లో..



## రానున్న మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

- అధికారులకు భారీ టార్గెట్ నిర్దేశించిన సీఎం చంద్రబాబు... డీటెయిల్స్ ఇవిగో!
- గృహనిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రతి మూడు నెలలకోసారి సామూహిక గృహప్రవేశాల నిర్వహణ
- వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లను సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశం
- ముస్లిం మైనార్టీలకు అదనంగా రూ. 50 వేల సాయం
- ఎన్టీఆర్ హౌసింగ్ పెండింగ్ బిల్లులపై కేంద్రంతో చర్చించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో 'అందరికీ ఇళ్లు' (హౌసింగ్ ఫర్ ఆల్) హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. రానున్న మూడేళ్లలో 17 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించి, పేదలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి 3 నెలలకోసారి లక్ష్యానికి అనుగుణంగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో టిడ్కో, గృహనిర్మాణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఎన్నికల్లో ఇచ్చిన 'హౌసింగ్ ఫర్ ఆల్' హామీని నెరవేర్చే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించాం. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి 2029 జనవరి నాటికి పూర్తి చేయాలి. కూటమి ప్రభుత్వం మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన 17 లక్షల ఇళ్లను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలి. దీనిలో భాగంగా వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు జరగాలి" అని దిశానిర్దేశం చేశారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని, త్వరలోనే టిడ్కో, గృహనిర్మాణ శాఖల సిబ్బందితోనూ సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

### ప్రజల సంతృప్తే ముఖ్యం

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. "ప్రస్తుతం జరుగుతున్న లబ్ధిదారుల సర్వేను వేగంగా పూర్తి చేసి, అర్హుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలి. ప్రజలు తృప్తి చెందితేనే నాకు సంతృప్తి. లబ్ధిదారులు స్థలం కావాలని కోరితే కేటాయించండి... సొంత స్థలం ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి. ప్రతి వివరమూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి" అని చంద్రబాబు ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన

వివరాలు 2లో..

## కర్ణాటక సీఎం మార్పు అంశం...

### కీలక వ్యాఖ్యలు చేసిన డీకే శివకుమార్



- ఐదేళ్లు సిద్ధరామయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్న డీకే శివకుమార్
- గ్రూపు రాజకీయాలు చేయడం తన రక్తంలో లేదని ఉద్ఘాటన
- కాంగ్రెస్ పార్టీ 140 మంది ఎమ్మెల్యేలు నా వారే అంటూ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం... సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

- లక్డీకాపూల్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరైన సినీతారలు
- బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వారిని విచారిస్తున్న సీఐడీ
- జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి



పెన్ పవర్ డెస్క్:బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వ్యవహారం లో ప్రముఖ సినీ తారలు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన ప్రముఖులను సీఐడీ

వివరాలు 2లో..

## నా ఆస్తులు జప్తు చేయడం ధర్మం కాదు

### కోర్టులో చెవిరెడ్డి ఆవేదన



- లిక్కర్ స్కాంలో ఆస్తుల జప్తుపై స్పందించిన చెవిరెడ్డి
- మద్యం వ్యాపారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- వారసత్వ ఆస్తులను జప్తు చేయడం ధర్మం కాదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో తన ఆస్తులను, తన కుటుంబ ఆస్తులను జప్తు చేసేందుకు

వివరాలు 2లో..

## కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి

### సీఎం చంద్రబాబుకు జగన్ లేఖ

- ఏపీ ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి
- ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వ వాదనలు బలహీనంగా ఉన్నాయని విమర్శ
- తెలంగాణ డిమాండ్లు, ఆల్మట్టి ఎత్తు పెంపుపై తీవ్ర ఆందోళన
- ఒక్క టీఎంసీ నీరు తగ్గినా టీడీపీ ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:కృష్ణా నదీ జలాల వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్-II(కేడబ్ల్యూడీటీ-II) ముందు త్వరలో జరగనున్న విచారణలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిలో

వివరాలు 2లో..



## పాకిస్థాన్‌లోని కంపెనీలో బాయిలర్ పేలి 16 మంది మృతి

- ఫైసలాబాద్ జిల్లాలో ఉదయం ప్రమాదం
- పరారైన ఫ్యాక్టరీ యజమాని, పోలీసులు అదుపులో మేనేజర్
- శిథిలాల కింద మరికొంతమంది ఉండవచ్చని చెబుతున్న అధికారులు

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల ఒక జిగురు తయారీ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో దాదాపు 16 మంది కార్మికులు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన లాహోర్ నుంచి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫైసలా బాద్ జిల్లాలో ఉదయం సంభవించింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద మరికొంతమంది ఉండి ఉండవచ్చని

వివరాలు 2లో..

## ఏపీలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల... మార్చి 16 నుంచి ఎగ్జామ్స్

- ఏపీలో 2026 పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల
- మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షల నిర్వహణ
- ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షల సమయం
- వివరాలను ప్రకటించిన సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు (BSEAP)



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు (BSEAP) శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షలను మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు వెల్లడించింది. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల

వివరాలు 2లో..

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ఆలయ సంప్రదాయాల ప్రకారం రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన టీటీడీ
- వేదపండితుల ఆశీర్వచనం స్వీకరించిన రాష్ట్రపతి
- హైదరాబాద్, పుట్టపర్తి కార్యక్రమాలలో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరు మల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం పద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరిన ఆమె, తిరుమల సంప్రదాయం ప్రకారం తొలుత శ్రీ భూ వరాహస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మహాద్వారం వద్దకు చేరుకున్న రాష్ట్రపతికి టీటీడీ ఛైర్మన్



వివరాలు 2లో..

## మామిడి రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది



- కూటమి ప్రభుత్వం, మోసం కవల పిల్లలని ఎద్దేవా చేసిన రోజా
- మామిడి రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపణ
- ఫ్యాక్టరీలు చెల్లించాల్సిన రూ.360 కోట్లను ఇప్పించడంలో సర్కారు విఫలమైందని మండిపాటు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ వర్సెస్ ముద్రగడ.... సీన్ రిపీట్ అవుతుందా ?

ఏపీ రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభం అంటే తెలియని వారు లేరు. కాంగ్రెస్ నుంచి రాజకీయ అరంగేట్రం చేసి తెలుగుదేశం బీజేపీ మళ్ళీ కాంగ్రెస్ ఆ తర్వాత వైసీపీ ఇలా ముద్రగడ పద్మనాభం అర్ధ శతాబ్దం రాజకీయం అంతా సాగింది. ఇక ఆయన తీరు చూస్తే ట్రెడిషనల్ పొలిటీషియన్ కాదని అంటారు. ఆయన ఒక బలమైన సామాజిక వర్గం ఆకాంక్షల సాధన కోసం పోరు బాట పట్టారు అలా రాజకీయంగా పీక్స్ లో ఉన్న వేళ ఉప ముఖ్యమంత్రి స్థాయి పదవులు అందుకునే చాన్స్ ని సైతం మిస్ చేసుకుని ఆయన తాను అనుకున్న పంథాలోనే ముందుకు సాగారని చెబుతారు.

**పెద్దాయన గా :**

ఇక ముద్రగడ కాపు సామాజిక వర్గంలో పెద్దాయనగా ఈ రోజుకీ గుర్తింపు అందుకుంటునే ఉన్నారు. ఏడు పదుల వయసు చేరువలో ఉన్న ముద్రగడ ఆ మధ్య అంతా అనారోగ్య సమస్యలతో సతమతం అయ్యారు అయితే తాను బాగానే ఉన్నాను అని కూడా ఇటీవల కాలంలో చెప్పారు. జగన్ ని 2029లో సీఎం గా చేయడానికి తన వంతుగా కృషి చేస్తాను అని ముద్రగడ చెప్పి ఉన్నారు ఆయనకు వైసీపీ కూడా పార్టీ అత్యున్నత వేదిక అయిన రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు కల్పించింది. ఇక ముద్రగడ కుమారుడు గిరికి ప్రత్తిపాడు సీట్లో ఇంచార్జి గా నియమించింది.

**పవన్ మీదకే అస్త్రం :**

అయితే వైసీపీ అధినాయకత్వం గోదావరి జిల్లాలో క్రమంగా మారుతున్న సామాజిక రాజకీయ పరిణామలను దృష్టిలో ఉంచుకుని ముద్రగడ కుటుంబం మీదనే పెను భారం పెడుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ముద్రగడ కుమారుడు గిరిని ప్రత్తిపాడు కంటే కూడా పిఠాపురం నుంచి పోటీ చేయించే ఆలోచనలో వైసీపీ హైకమాండ్ ఉందని అంటున్నారు. ముద్రగడకు పిఠాపురంలోనూ పట్టు ఉంది. ఆయన అనుచర వర్గం పెద్ద ఎత్తున పిఠాపురంలో ఉంది. దాంతో కుమారుడికి టికెట్ ఇస్తే ముద్రగడ రంగంలోకి దిగితే ఇక పిఠాపురంలో వైసీపీ రాజకీయం నల్లేరు మీద నడక మాదిరిగా సాగిపోతుంది అని కొత్త ఆలోఅనలు వైసీపీ పెద్దలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

**ఆమె అవుట్ :**

ఇక ప్రస్తుతం పిఠాపురం వైసీపీ ఇంచార్జిగా ఉన్న వంగా గీత పెర్ఫార్మెన్స్ మీద వైసీపీ పెద్దలు పెదవి విరుస్తున్నారు అని అంటున్నారు. మరో వైపు వంగా గీత సైతం తనకు పిఠాపురం అసెంబ్లీ సీటు వద్దని వేరే చోటకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని కూడా ప్రచారంలో ఉంది. అయితే ఆమెకు ఇంకో చోట చాన్స్ ఇస్తారా లేదా అన్నది పక్కన పెడితే పిఠాపురంలో మాత్రం వంగా గీత అవుట్ అయినట్లే అని అంటున్నారు. ముద్రగడ పద్మనాభం ఫ్యామిలీనే ఈసారి రంగంలోకి దించి పవన్ కళ్యాణ్ ని దెబ్బ కొట్టాలని మాస్టర్ స్కెచ్ గీస్తున్నారు అని అంటున్నారు.

**మోజు తీరిపోతుందనా :**

పవన్ కళ్యాణ్ రొటీన్ రెగ్యులర్ పొలిటీషియన్ కాదని వైసీపీ భావిస్తోంది. ఆయన మీద మోజుతో 2024 ఎన్నికల్లో గెలిపించారని ఇప్పటికే కాపులలో అంతర్మధనం మొదలైందని కూటమి పాలన పట్ల అసంతృప్తి కూడా నెమ్మదిగా పెరుగుతోందని అది కాస్తా 2029 ఎన్నికల నాటికి పీక్స్ కి చేరుకుంటుందని అంచనా వేస్తోంది. అలా కనుక జరిగితే మాత్రం పిఠాపురంలో ఫ్యాన్ గిర్రున తిరిగే అవకాశాలు కూడా కొట్టి పారేయలేమని అంటున్నారు. ఒక వేళ అది జరగకపోయినా గట్టి పోటీ ఇచ్చి అయినా పవన్ ని కట్టడి చేస్తే మిగిలిన నియోజకవర్గాలలో వైసీపీకి అది ఎంతో ఉపయోగంగా ఉంటుందని కూడా భావిస్తున్నారుట. మొత్తానికి పవన్ వర్సెస్ ముద్రగడగా సీన్ ని రిపీట్ చేయాలని ఆరాటపడుతోంది అని అంటున్నారు. మరి దీనికి పెద్దాయన ముద్రగడ ఏ మేరకు స్పందిస్తారు అన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

- మొదటి పేజీ తరువాయి

అధికారులు వరుసగా విచారిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల నటులు విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లను సీఐడీ అధికారులు విచారించారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని సీఐడీ వరుసగా విచారణకు పిలుస్తోంది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి వీరు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ యువత ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో, వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైంది. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్ అంశంపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. శ్రీముఖి జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేయగా, అమృత చౌదరి పలు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేశారు.

# చంద్రబాబు కుప్పం వాసుల దశాబ్దాల కల నెరవేర్చారు

- మొదటి పేజీ తరువాయి

కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకువచ్చి, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను సాకారం చేశారని ఆమె కొనియాడారు. తన కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**

పర్యటనలో భాగంగా నడింపల్లి గ్రామంలోని గంగమ్మ ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని, వారితో కలిసి కోలాటం ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే గొప్ప సంకల్పంతో చంద్రబాబు గారు డ్వాక్రా సంఘాలను స్థాపించారు. నేడు ఆ మహిళలు వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని, వాటిని సకాలంలో చెల్లిస్తూ పారిశ్రామికవేత్తల స్థాయిలో నిలుస్తున్నారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. మన వల్ల కాదు అనే భావన నుంచి బయటకు రావాలి. ఎదురయ్యే సవాళ్లను పాఠాలుగా స్వీకరించి ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు.

మహిళల్లోని ప్రతిభను గుర్తించి, వారికి సరైన శిక్షణ ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో 'ఎలీప్' సంస్థ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా మహిళల ఆర్థిక ప్రగతికి టైలరింగ్, మగ్గం, చికెన్ కారీ వర్క్ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. నడింపల్లి గ్రామంలో ప్రభుత్వం ద్వారా 198 మందికి పింఛన్లు, టిడ్కో కింద 62 గృహాలు, రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు.

**అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ నంబర్ వన్**

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే చంద్రబాబు సంకల్పమని భువనేశ్వరి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. "చంద్రబాబు గారి దూరదృష్టితో కుప్పానికి నీటి కష్టాలు శాశ్వతంగా తీరాయి. కుప్పంలోని ప్రతి గ్రామం పచ్చగా కళకళలాడాలన్నదే ఆయన ఆకాంక్ష. ఇటీవల కుప్పానికి 7 పరిశ్రమలు వచ్చాయి, త్వరలోనే మరో 8 సంస్థలు రానున్నాయి. వీటితో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని ఆమె అన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలు భయం గుప్పిట్లో జీవించారని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. 'నిజం గెలవాలి' యాత్రలో, ఎన్నికల సమయంలో నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడు కుప్పం ప్రజలు చూపిన ఆదరణ, సహకారం మరువలేనిదని, వారి రుణం తీర్చుకోలేనిదని భువనేశ్వరి భావోద్వేగంగా ప్రసంగించారు.

**కృష్ణమ్మకు జలహారతి**

అనంతరం తుమ్మిసి పెద్ద చెరువు వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. కృష్ణా జలాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి హారతి ఇచ్చారు. అంతకుముందు, ఆమె శాంతిపురం నుంచి తుమ్మిసి వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బస్సులోని మహిళా ప్రయాణికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ క్రమంలో, ఉచిత ప్రయాణ పథకం నిబంధనల ప్రకారం మహిళా కండక్టర్ ఆమెను ఆధార్ కార్డు అడగగా, విధి నిర్వహణ పట్ల ఆమెకున్న అంకితభావాన్ని భువనేశ్వరి అభినందించారు.

# కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి

- మొదటి పేజీ తరువాయి

763 టీఎంసీల నీటిని తమ రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని జగన్ ప్రస్తావించారు. ట్రైబ్యునల్ ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన తుది వాదనలను బలంగా వినిపించి, ఏపీకి జరగబోయే నష్టాన్ని నివారించాలని సూచించారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడటంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని జగన్ ఆరోపించారు. "ప్రభుత్వం ట్రైబ్యునల్ ముందు బలహీనమైన వాదనలు వినిపిస్తోంది. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.16 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచేందుకు అవసరమైన భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇవ్వడాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ వైఖరి సరిగా లేకపోవడం వల్లే పొరుగు రాష్ట్రాలు ఏపీకి నష్టం కలిగించే చర్యలు తీసుకుంటున్నాయని విమర్శించారు.

1996లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచే పనులు మొదలయ్యాయని, అప్పుడు రైతులు, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసినా ఆయన పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చిందని, 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు వదులుకుందని ఆరోపించారు. "ఈ కీలక తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై మన హక్కులను కాపాడాలి. బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర జలాల్లో ఒక్క టీఎంసీ తగ్గినా, అందుకు టీడీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని జగన్ తన లేఖలో స్పష్టం చేశారు.

# ఏపీలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల... మార్చి 16 నుంచి ఎగ్జామ్స్

- మొదటి పేజీ తరువాయి

నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ప్రకటనతో విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై స్పష్టత వచ్చింది. హాల్ టికెట్లు, ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పరీక్షల తేదీల పూర్తి వివరాలు

**మార్చి 18: సెకండ్ లాంగ్వేజ్**

మార్చి 20: ఇంగ్లీష్

మార్చి 23: గణితం

మార్చి 25: ఫిజిక్స్ (భౌతికశాస్త్రం)

మార్చి 28: బయాలజీ (జీవశాస్త్రం)

మార్చి 30: సోషల్ స్టడీస్ (సాంఘికశాస్త్రం)

మార్చి 31: ఫస్ట్ లాంగ్వేజ్ (కాంపోజిట్ పేపర్-2)

ఏప్రిల్ 1: %బాూబాూజ% సెకండ్ లాంగ్వేజ్ (పేపర్-2)

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించుకున్న అనంతరం రాష్ట్రపతి గర్భాలయంలోకి ప్రవేశించి శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, 2026 టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు. గురువారమే తిరుపతికి చేరుకున్న రాష్ట్రపతి, మొదట తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆమెకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు.

తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ 2025ను ఆమె ప్రారంభించనున్నారు. రేపు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలలో ఆమె పాల్గొంటారు.

# కర్ణాటక సీఎం మార్పు అంశం... కీలక వ్యాఖ్యలు చేసిన డీకే శివకుమార్

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెరదించారు. ఐదేళ్ల పాటు సిద్ధరామయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, ఆయనకు తాము పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. గ్రూపు రాజకీయాలు చేయడం తన రక్తంలోనే లేదని ఆయన అన్నారు. ఎవరో కొంతమంది మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన 140 మంది ఎమ్మెల్యేలు కూడా తనవారే అని ఆయన వ్యాఖ్యానించారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సిద్ధరామయ్య చెప్పారని, ఈ నేపథ్యంలో పలువురు ఎమ్మెల్యేలు ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలను కలిశారని ఆయన అన్నారు. వారు మంత్రి పదవుల కోసమే కలిసి ఉంటారని, అది సహజమేనని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. మంత్రి పదవి కోసం వారు ముఖ్యమంత్రిని కూడా కలిశారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు తమంతట తామే వెళ్లారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 140 మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవులకు అర్హులేనని, వారికి ఏ బాధ్యత అయినా అప్పగించవచ్చని శివకుమార్ అన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య స్పష్టం చేశారని, ఆయనకు తాను శుభాకాంక్షలు చెబుతున్నానని అన్నారు. మేమంతా కలిసి పనిచేస్తామని అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. డీకే శివకుమార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఢిల్లీ బాట పట్టడంతో తాజాగా మరోసారి కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన వర్గం కోరుకుంటోంది. ఈ మేరకు అధిష్ఠానంపై ఒత్తిడి తేవడానికి ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లారు. ఈరోజు డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

**సీఎం మార్పు ప్రచారాన్ని కొట్టిపారేసిన సుర్జేవాలా**

నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రణ్?దీప్ సుర్జేవాలా తోసిపుచ్చారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ చేస్తున్న దుష్ప్రచారమని ఆయన ఆరోపించారు. సిద్ధరామయ్య, శివకుమార్‌లతో తాను చర్చలు జరిపానని కూడా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మార్పు అంటూ పార్టీకి చెందిన వారెవరూ బహిరంగ ప్రకటనలు చేయవద్దని ఆయన హెచ్చరించారు.

**స్పందించిన సిద్ధరామయ్య**

నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం మాత్రమే నిర్ణయం తీసుకుంటుందని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఖర్గే, గాంధీల నిర్ణయమే శిరోధార్యమని అన్నారు. అధిష్ఠానం మాటకు తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉంటామని తెలిపారు. మరోవైపు, ఈరోజు ఉదయం సిద్ధరామయ్య పార్టీ అధినేత ఖర్గేకు ఫోన్ చేశారు. నిత్యం ముఖ్యమంత్రి మార్పు అంశంపై మాట్లాడుతుండటం రాష్ట్రంలో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని ఆయన వివరించారు. ఈ అంశానికి తెరదించుతామని ఖర్గే ఆయనకు హామీ ఇచ్చారు.

# పాకిస్థాన్‌లోని కంపెనీలో బాయిలర్ పేలి 16 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఫ్యాక్టరీ యజమాని పరారీ కాగా, మేనేజర్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేలుడు తీవ్రత అధికంగా ఉండటం వల్ల సమీపంలోని భవనాలు కూడా దెబ్బతిన్నాయని ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ రాజా జహంగీర్ అన్వర్ మీడియాకు వెల్లడించారు. సహాయక బృందాలు ఇప్పటివరకు శిథిలాల నుంచి 15 మృతదేహాలను వెలికి తీశాయని, గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ప్రాణనష్టం సంభవించినందుకు పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ప్రమాదంపై ఫైసలాబాద్ కమిషనర్ నుంచి నివేదిక కోరినట్లు తెలిపారు.

# మామిడి రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది

కూటమి ప్రభుత్వం, మోసం రెండూ కవల పిల్లల్లా మారిపోయాయని, అన్నం పెట్టే రైతులను చంద్రబాబు సర్కారు దారుణంగా మోసం చేస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా తీవ్రస్థాయిలో విమర్శించారు. మామిడి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనివల్ల సుమారు 45 వేల మంది రైతులు రూ.180 కోట్లు నష్టపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మాజీ సీఎం జగన్ వారిని ఆదుకునేందుకు పర్యటనకు సిద్ధమయ్యారని రోజా గుర్తుచేశారు. దీంతో భయపడిన కూటమి ప్రభుత్వం, హడావుడిగా 4.50 లక్షల టన్నుల తోతాపురి మామిడిని ఫ్యాక్టరీలకు తరలించిందని పేర్కొన్నారు. అప్పుడు కిలో మామిడికి ప్రభుత్వం రూ.4, ఫ్యాక్టరీలు రూ.8 కలిపి మొత్తం రూ.12 చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

నెలలు గడిచాక, రైతు సంఘాలు ఆందోళన చేయడంతో ప్రభుత్వం తన వాటా రూ.180 కోట్లు విడుదల చేసిందని, కానీ ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.360 కోట్లు మాత్రం ఇప్పటికీ చెల్లించలేదని రోజా విమర్శించారు. పైగా, ఫ్యాక్టరీ యాజమాన్యాలు హామీ ఇచ్చినట్లు కిలోకు రూ.8 బదులుగా, కేవలం రూ.3 నుంచి రూ.4 మాత్రమే చెల్లిస్తున్నాయని రైతులు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని, ఫ్యాక్టరీల నుంచి రైతులకు కిలోకు రూ.8 చొప్పున రావాల్సిన రూ.360 కోట్లను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుల న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుందని రోజా స్పష్టం చేశారు.

# నా ఆస్తులు జప్తు చేయడం ధర్మం కాదు కోర్టులో చెవిరెడ్డి ఆవేదన

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని ఇవ్వడంపై వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణంతో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, ఒక్క రూపాయి కూడా మద్యం వ్యాపారం ద్వారా సంపాదించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈరోజు విజయవాడ ఏసీబీ కోర్టులో ఈ మేరకు ఆయన తన వాదన వినిపించారు. "నాకు లిక్కర్ వ్యాపారంతో ఎటువంటి సంబంధం లేదు. నేను సంపాదించిందంతా రియల్ ఎస్టేట్ ద్వారానే. కష్టపడి సంపాదించిన నా ఆస్తులను లిక్కర్ ద్వారా సంపాదించినట్లు ఆరోపించడం బాధాకరం. వందల ఏళ్లుగా మా కుటుంబానికి సంక్రమించిన వారసత్వ ఆస్తులను అటాచ్‌మెంట్ చేయడం ధర్మం కాదు" అని చెవిరెడ్డి అన్నారు. ఈ కేసుల వల్ల తన కుటుంబం

మొత్తం చిన్నాభిన్నమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాట్లాడకపోతే నిజంగానే తప్పు చేశానని ప్రజలు అనుకుంటారని, అందుకే వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "కూటమి ప్రభుత్వం సంతృప్తి చెందే వరకు నన్ను జైలులో ఉంచినా భయపడను. ఎన్ని రోజులైనా జైలులో ఉండటానికి సిద్ధంగా ఉన్నాను" అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు.

# రానున్న మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

- మొదటి పేజీ తరువాయి

(PMAY 1.0) కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు సాయాన్ని ఇకపై ముస్లిం మైనార్టీలకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించారు. దీని ద్వారా 18 వేల మంది ముస్లిం మైనార్టీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేల చొప్పున సాయం అందుతుందని, దీనికి రూ. 90 కోట్లు అవసరమవుతాయని వివరించారు.

**పెండింగ్ బిల్లులపై కేంద్రంతో సంప్రదింపులు**

గత ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన రూ. 920 కోట్ల బిల్లులు నిలిచిపోయాయని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "గత ప్రభుత్వం ఏ విధంగా ఈ బిల్లులను అడ్డుకుందో కేంద్రానికి వివరించి, వాటిని తిరిగి రాబట్టేందుకు సంప్రదింపులు జరపండి. గతంలో నరేగా పనులకు సంబంధించి ఆగిపోయిన బిల్లులను కూడా ఇదే తరహాలో తిరిగి వచ్చేలా చేశాం. అదే పద్ధతిలో ఈ హౌసింగ్ బిల్లులను కూడా సాధించాలి" అని అధికారులను ఆదేశించారు. 2014-19 మధ్య 8 లక్షల ఇళ్లు, 2019-24 మధ్య 5.80 లక్షల ఇళ్లు నిర్మించినట్లు అధికారులు ఈ సమావేశంలో వివరించారు. ఈ సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు టిడ్కో, హౌసింగ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్స్‌ల మంజూరు - కలెక్టరేట్ లో ప్రత్యేక శిబిరం



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్స్, ఎల్.ఎల్.ఆర్. మంజూరు కోసం శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్.ఎల్.ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ ల మంజూరులో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రీవెన్స్ లో పలువురు దివ్యాంగులు తెలిపారని, దీనిపై స్పందించి ప్రత్యేకంగా ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 59 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో రవాణా శాఖ సిబ్బంది ఆన్ లైన్ ద్వారా ఎల్ ఎల్ ఆర్, లైసెన్స్ స్లాట్ లను బుక్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, రవాణాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# లింగసముద్రంలో ప్రజాదర్బార్

**రెవిన్యూ అవినీతి పైనే ఫిర్యాదుల వెల్లువ**
**స్థలంలో ఒకరు...రికార్డుల్లో ఇంకొకరు**
**తప్పులన్నీ వెంటనే సరిచేయాలని**
**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే**
**వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే వల్లే**
**ఇబ్బందులు వచ్చాయని వెల్లడి**
**ప్రజలను పదేపదే తిప్పుకోకుండా,**
**సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు**
**ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన**
**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 21**

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో లింగసముద్రం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన వివిధ గ్రామాల ప్రజలు, తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొత్తం 110 అర్జీలు రాగా, శాసనసభ్యుల వారు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అక్కడున్న అధికారులకు సూచనలు ఇచ్చారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం మొత్తం మీద, లింగసముద్రం మండలంలోనే రెవెన్యూ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి.ప్రజాదర్బార్ లో వాటి గురించి అర్జీలే ఎక్కువగా వచ్చాయి. ఒకే స్థలాన్ని ఇద్దరు ముగ్గురికి పట్టా ఇచ్చారు. అలాగే భూమి మీద ఒకరు ఉంటే, రికార్డుల్లో వేరొకరి పేరు కనిపిస్తోంది. గతంలో పని చేసిన రెవెన్యూ అధికారుల కారణంగానే ఈ సమస్యలు వచ్చాయి. గత వైసిపి ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే మొత్తం తప్పులు తడక హడావుడి సర్వే వల్లే అనేక కొత్త సమస్యలు పుట్టుకొచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఆ తప్పులన్నీ సరి చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. ఒక్కొక్క సమస్యను లోతుగా పరిశీలించాలి. భూమిపై ఉన్న వారి పేర్లు మాత్రమే ఆన్ లైన్ లో కనిపించాలి. వీలైనంత త్వరగా ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులు ఆదేశిస్తున్నాను. ఇంకా మిగిలిన సమస్యల పైన కూడా అర్జీలు వచ్చాయి. దరఖాస్తు దారులను పదేపదే ఆఫీసుల చుట్టూ తిప్పుకోకుండా, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలను ముఖ్యమంత్రి పోర్టల్ లో అప్లోడ్ చేయబోతున్నాం. ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరంతరం పర్యవేక్షణ చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారి వి.బాలసుబ్రమణ్యం ఎమ్మార్వో కోటేశ్వరరావు, ఎంపీడీవో కె .శ్రీనివాసరావు, అన్ని శాఖల అధికారులు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, లింగసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, పార్టీ నాయకులు వంకాయలపాటి మాల్యాద్రి, అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, మద్దెల రామారావు, పూరిమెట్ల మాల్యాద్రి అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్తీ మాతా బచావో నిగ్రాణి సమితిల ఏర్పాటుకు

# కలెక్టర్ రాజాబాబు ఆదేశం





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 21**

స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి ధర్తీ మాతా బచావో అభియాన్ (భూమి మాత రక్షణ కార్యక్రమం–5050) కార్యక్రమం కింద ధర్తీ మాతా బచావో నిగ్రాణి సమితి ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, అధికారులతో సమావేశమై ధర్తీ మాతా బచావో అభియాన్ (భూమి మాత రక్షణ కార్యక్రమం –5050) కార్యక్రమం విధివిధానాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధర్తీ మాతా బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా లో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన విధంగా గ్రామ, సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితి లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు తమ పొలాల నేల పరిస్థితులను మెరుగుపరచడానికి, అలాగే అవసరం మేరకు ఎరువులను వివేక వంతంగా ఉపయోగించమని ప్రోత్సహించడం, రైతు లకు పంపిణీ చేయబడిన నేల ఆరోగ్య కార్డు నేలలో సూక్ష్మ పోషకాల లోపాన్ని పరిష్కరించడంలో సహాయపడేలా ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంటుం దన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువై , వాటి అవశేషాలు మన ఆహారం ద్వారా మన శరీరం లోకి చేరుతున్నాయని, దానివలన కాన్సర్ వంటి పలు రకాల వ్యాధులకు మనం గురవుతున్నామని , కనుక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందని, అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ అధికారి సుభాషిని, మార్క్ఫెడ్ అధికారి హరి క్రిష్ణ, జిల్లా సహకార శాఖాదికారి శ్రీలక్ష్మి, ఫెర్టిలైజర్స్ డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య సంపద ఆదాయ ఆర్జనలో ప్రధమ స్థానంలో ఆంధ్ర ప్రదేశ్

**మంత్రి డాక్టర్ డోలా**
**శ్రీ బాల వీరాంజనేయ స్వామి**
**ఘనంగా ప్రపంచ మత్స్య**
**దినోత్సవ వేడుకలు**
**పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజాబాబు,**
**జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ,**
**ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు**









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 21**

రాష్ట్రానికి కీలక ఆదాయ వనరుగా మత్స్య సంబంధ కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమాత్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఘనంగా జరిగాయి. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు జి.పేరయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు రాచగర్ల. వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్య ఆదాయం ఆర్జనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆక్వా కల్చర్ లో ఒక్కో యూనిట్ రూ.1.5 చొప్పున విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇసన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని వారి భూములను ప్రభుత్వం వెనక్కి ఇచ్చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. ఆక్వా రంగంలో మరింత మంది అధ్యయనం చేసేలా కాలేజీలలో వినూత్న కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి ఉన్న విశాల తీరప్రాంతాన్ని ఆదాయంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు తమ ఆదాయం పెంచుకునేందుకు ఉత్తమ విధానాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంతం వెంట చేపట్టిన పర్యాటక, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో ధరలను కూడా మత్స్యకారుల సమక్షంలోనే ఖరారు చేశామని గుర్తు చేశారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ సామాజిక కట్టుబాటుకు మత్స్యకారులు ప్రతిరూపంగా ఉంటున్నట్లు చెప్పారు. వేట నిషేధ సమయంలోనూ,;;ఇతర విపత్తులలోనూ ఈ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తాజాగా వచ్చిన మొంథా తుఫాన్ సమయంలోనూ మరిన్ని నిత్యావసర సరుకులను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచడాన్ని ఆయన ప్రస్తావించారు. పల్లెపాలెంలో త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పనులు కూడా మొదలు పెడతామని చెప్పారు. మత్స్యకారులకు ఉపయోగపడేలా జెట్టీ కూడా కట్టామన్నారు. మత్స్యకారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, డీజిల్ కు ఇస్తున్న సబ్సిడీని కూడా పెంచేలా ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ప్రకటించారు. మడనూరు – గుండమాల బీచ్ రోడ్డును సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక మత్స్యకారులకు తమిళనాడు మత్స్యకారుల నుండి ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేలా గత ఏడాదే ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మత్స్యకారులకు ఇళ్ల స్థలాల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ మాట్లాడుతూ మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కోసం అమలు చేస్తున్న పథకాలే దీనికి నిదర్శనం అని చెప్పారు. జి. పేరయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇస్తున్న సబ్సిడీని పెంచాలని కోరారు. రాయితీ డీజిల్ ను 300 లీటర్ల నుంచి 600 లీటర్లకు పెంచాలని కూడా ఆయన అభ్యర్థించారు. ఆర్. వెంకట్రావు, శ్రీనిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ విజయరత్నం, పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఫిషరీస్ రంగంలో ఉన్న అభివృద్ధి అవకాశాలు, ప్రభుత్వం నుంచి కావాల్సిన తోడ్పాటును వివరించారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల విలువైన బ్యాంకు చెక్కును ఈ కార్యక్రమంలో అతిథులు అందించారు. పదిమంది మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, ఐదుగురికి జిపిఎస్ సెట్లు, ఇద్దరికి పడవలు, ఇంజిన్లు, వలలను కూడా ప్రదానం చేశారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరం -ఎంపీడీవో సంజీవ్‌రావు






**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 21**

పుల్లల చెరువు మండలం యండ్రపల్లి పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర %--% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంజీవ్ రావు మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో ప్రజల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు.ఇంటింటా వంద శాతం చెత్త సేకరణ జరగాలని, ఇందుకోసం ప్రతి గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి ఇవ్వడం అలవాటు కావాలని చెప్పారు. చెత్తకుప్పలు లేని గ్రామ సమాజాన్ని నిర్మించడం మనందరి లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ప్రతిపాదనలకు ప్రజల సహకారం జతకడితేనే నిజమైన పరిశుభ్రత సాధ్యమని అన్నారు. మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని, దీనికి ప్రజా భాగస్వామ్యం అత్యవసరమని వివరించారు.అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు.రోడ్లపై వ్యర్థాలు వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని, ఎక్కడైనా చెత్త కనిపిస్తే వెంటనే డస్ట్‌బిన్‌లో వేయాలి అని సూచించారు.ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అప్పగిస్తే వారు వాటిని సక్రమంగా నిర్వహిస్తారని తెలిపారు. పరిశుభ్రమైన ప్రదేశాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటే ఎవరూ అక్కడ చెత్త వేయడానికి ముందుకు రారని అన్నారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా గ్రామీణ జీవనం మరింత ఆరోగ్యకరంగా మారుతుందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రమైన గాలి, నీరు అందించేందుకు విస్తృత చర్యలు తీసుకుంటున్నాయనీ, ఇందుకు తగిన విధంగా ప్రజలు సహకరించాలన్నారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి పనిచేస్తే ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడం సాధ్యమని అన్నారు.స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణం కోసం ప్రతి పౌరుడు వ్యక్తిగత బాధ్యతగా పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. మన గ్రామం, మన పరిసరాలు శుభ్రంగా ఉంచడం మనందరి కర్తవ్యం. కలిసి పనిచేస్తే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం త్వరలోనే నెరవేరుతుంది అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, యండ్రపల్లి సర్పంచ్,పంచాయితీ సెక్రటరీలు నలగాటి ఆత్మ నాయుడు, అంజిరెడ్డి,సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గ్రంధాలయం వారోత్సవాల పోటీల్లో బ్రిలియంట్ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 21**

58 వ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా ఎర్రగొండపాలెం గ్రంధాలయం శాఖ నవంబర్ 14 నుండి 20 వ తేదీ వరకు పలు రకాల అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఎర్రగొండపాలెం బ్రిలియంట్ హైస్కూలు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను చూపి విజేతలుగా నిలిచారని బ్రిలియంట్ హైస్కూలు కరస్పాండెంట్ బి.కుల్లాయప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంధాలయంలో గ్రంధాపాలకురాలు కటికెలా ఝున్సీ ఆధ్వర్యంలో లో బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధులు గా మండల విద్యాశాఖాధికారులు పి.ఆంజనేయులు,మల్లునాయక్ హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్బంగా అతిదులు మాట్లాడుతూ బ్రిలియంట్ హైస్కూలు కు చెందిన దివ్యశ్రీ అనే విద్యార్థిని వ్యాస రచన పోటీల్లో ప్రథమ స్థానం, డిబేట్ లో ద్వితీయ స్థానం, కుసుమ శివాని అనే విద్యార్థిని,చిత్రలేఖనం లో స్వాతి అనే విద్యార్థిని ప్రథమ స్థానం, సునీత అనే విద్యార్థిని కి తృతీయ స్థానం పొందారని అన్నారు.డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు ప్రదీప్ ,సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ కు చెందిన మరియబాబు ఉపాద్యాయులు నానా.నాగేశ్వరరావు, సురేష్ బాబు,మురళిపాల్గొన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ కుల్లాయప్ప , ఉపాద్యాయులు అభినందించారు.

## డ్రోన్ ద్వారా పిచికారీ ప్రదర్శన వ్యవసాయాధికారి పి మధుబాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**

మండల పరిధిలోని వెంగనగుంట, పెద్ద గోగులపల్లి గ్రామలలో శుక్రవారం డ్రోన్ ద్వారా మందులు పిచికారీపై ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు ఆత్మసౌజన్యంతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ ద్వారా పంటలకు రసాయనాలు, ఎరువులను కచ్చితమైన మోతాదులో, తక్కువ సమయంలో సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు. రైతులు రసాయనాలకు ప్రత్యక్షంగా బహిర్గతం కాకుండా రిమోట్ కంట్రోల్ ద్వారా వ్యవహరించవచ్చని సూచించారు.అలాగే తెగుళ్ల వ్యాప్తి లేదా పురుగుల ఉధృతి ఎక్కువైన సమయంలో డ్రోన్ల ద్వారా వేగంగా పిచికారీ చేసి వ్యాప్తిని అదుపులోకి తేవచ్చని చెప్పారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులను కూడా డ్రోన్ల ద్వారా సులభంగా స్ప్రే చేయవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ బిటిఎం సి హెచ్ సురేఖ, వ్యవసాయ సహాయకులు షేక్ జిలాని, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయ అభివృద్ధికి అందరు తోడ్పాటు అందించాలి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలోని యువతి యువకులకు, విద్యార్థిని విద్యార్థులకు మేధస్సును అందించే గ్రంధాలయ అభివృద్ధికి అందరు తోడ్పాటు అందించాలని గ్రంధాపాలకురాలు కటికెలా ఝున్సీ అన్నారు. శుక్రవారం గ్రంధాలయ వారోత్సవాలా ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ నెల 14నుండి మొదలైన వారోత్సవాలలో పట్టణంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వపాఠశాలల విద్యార్థిని విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు.కార్యక్రమంలో యం ఈ ఓ లు ఆంజనేయులు, మల్లునాయక్ లు మాట్లాడుతూ చిన్నారుల మొదలు యువకులకు, పెద్దలకు గ్రంధాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని, మేధస్సును పెంచే బండాగారం గ్రంధాలయం అని అన్నారు. చదువుతో పాటు వివిధ పోటీలను నిర్వహించిన గ్రంధాలయ నిర్వహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శీలంవారిపల్లి ఇంటర్ విద్యార్థులకు కిస్ కాలేజీ ఆహ్వానం

### ఆధునిక ఇంజనీరింగ్ కోర్సులతో ఉత్తమ భవిష్యత్తు





**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్-2 విద్యార్థులను కిస్ ఇంజనీరింగ్ కాలేజీ ఒంగోలు సిబ్బంది శుక్రవారం పర్యటించి కళాశాలలో అడ్మిషన్లకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా కాలేజీ సిబ్బంది మాట్లాడుతూ మా కిస్ కాలేజీ అత్యాధునిక కోర్సులతో, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉన్నతమైన విద్యను అందిస్తోంది. కంప్యూటర్ సైన్స్ %ఇ% ఇంజనీరింగ్ (డేటా సైన్స్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీతో సైబర్ సెక్యూరిటీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ %ఇ% కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్ వంటి డిమాండ్ ఉన్న విభాగాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.అలాగే సిఎస్ఇ, ఈసిఇ, ఈఇఈ, మెకానికల్ విభాగాల్లో జెఎన్టీయూ గుర్తింపు పొందిన పరిశోధన కేంద్రాలు ఉండటం విశేషమని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఆధునిక లాబొరేటరీలు, ప్లేస్మెంట్ అవకాశాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు కళాశాల ప్రత్యేకతని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ 2026-27వ బ్యాచ్ లో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు తమ భవిష్యత్తు నిర్మాణానికి కిస్ కాలేజీని ఎంపిక చేసుకోవాలని వారు సూచించారు.ఈ సందర్భంగా కాలేజీ సిబ్బంది పాఠశాల అధ్యాపకులకు డైరీ , విద్యార్థులకు పాంప్లెట్లు అందజేశారు.

# కట్టు తప్పితే శిక్ష తప్పదు

## - జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

### - ఇద్దరు హోమ్ గార్డులను విధుల నుండి తాత్కాలికంగా నిలిపివేత

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**

ప్రకాశం జిల్లాలో సాగే సాగర్ కవచ్ బందోబస్తు కార్యక్రమం నేపథ్యంలో ఒంగోలుకు విధి నిర్వహణ కోసం వచ్చిన పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌కు చెందిన హోమ్ గార్డ్ షేక్ యాసిన్, దోర్నాల పి.ఎస్.కి చెందిన తంగిరాల ప్రశాంత్ కుమార్, వెలిగండ్ల పి.ఎస్.కి చెందిన చెరుకూరి బాల సుబ్రహ్మణ్యం ముగ్గురు బుధవారం రాత్రి ఒంగోలులోని అన్నపూర్ణ లాడ్జ్‌లో విశ్రాంతి కోసం గదిని తీసుకున్నారు. అనంతరం ముగ్గురు కలసి మద్యం తాగి, సిగిరెట్ కాల్చే సమయంలో ప్రశాంత్ కుమార్, బాల సుబ్రహ్మణ్యం ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడి, పరస్పరం తోసివేసుకోవడం, చేతులతో కొట్టుకునే సంఘటన చోటుచేసుకుంది. గొడవ సమయంలో, బాల సుబ్రహ్మణ్యం కిందపడటం వల్ల తలకు గాయమైనది. ఈ విషయం తెలుసుకున్న ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు వెంటనే అధికారులను విచారణకు ఆదేశించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను పాటించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేస్తూ, ఈ ఘటనపై సమగ్ర రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ప్రాథమికంగా ముగ్గురు హోమ్ గార్డులను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు పిలిపించి విచారణ కొనసాగుతోంది. ప్రశాంత్ కుమార్, బాల సుబ్రహ్మణ్యలను విధుల నుండి తాత్కాలికంగా నిలిపివేయటం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ కొనసాగుతుంది. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది, హోమ్ గార్డులు సహా ప్రతీ ఒక్కరూ విధులు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణ, ప్రవర్తనా నియమాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, శాఖ



ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, వారిపై చర్యలు తీసుకోబడతాయని, హోమ్ గార్డులు కూడా పోలీస్ వ్యవస్థలో ఒక భాగమే అని జిల్లా ఎస్పీ అన్నారు.

## గుండెపోటుతో తాటిచెర్ల విద్యుత్ లైన్మెన్ బీకోజీ నాయక్ మృతి

డ్యూటీ ముగించుకుని గురువారం సాయంత్రం

నరసరావుపేటకు వెళ్లిన బికోజి నాయక్.

గురువారం రాత్రి ఇంటిలో

గుండెపోటుతో మృతి చెందిన నాయక్.



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 21**

కొమరోలు మండలం తాటిచెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ లో లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. బికోజీ నాయక్ (42) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. బికోజి నాయక్ స్వగ్రామం పుల్లలచెరువు కాగా, ఆయన తాటిచెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ లో లైన్మెన్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య నరసరావుపేటలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నదని, భార్యాబిడ్డలను చూసేందుకు నాయక్ గురువారం సాయంత్రం విధులు ముగించుకొని నరసరావుపేటకు వెళ్లాడని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. అయితే గురువారం రాత్రి నాయక్ కు గుండెపోటు రావడంతో ఆయనను కుటుంబ సభ్యులు సమీపంలో ఆసుపత్రికి తరలించారని, అయితే నాయక్ మృతి చెందినట్లుగా వైద్యులు చెప్పారని సిబ్బంది తెలిపారు నాయక్ కు భార్య ,ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బికోజీ నాయక్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల కొమరోలు మండల విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు, మండలంలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అనిల్ దంపతులు

**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 21**

రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ దంపతులు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనిల్ కుమార్ ఆయన సతీమణి సురేఖ దంపతులు శుక్రవారం నాడు శ్రీశైలంలోని భ్రమరాంబికా దేవి సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, అలాగే మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిస్థితి అన్ని విధాల బాగుండాలని, భవిష్యత్తులో నారాయణరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని మల్లికార్జున స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. మల్లికార్జున స్వామిని దర్శించుకున్న వారిలో అనిల్ కుమార్ దంపతులతో పాటు వారి బంధువులు ఫణి కుమార్, పి స్వాతి, రావూరి సుబ్బారావు, సీతారామాంజనేయులు, మౌలిక జ్యోతి తదితరులు కూడా ఉన్నారు.



# గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

## కంభంపాడులో థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

## ముఖ్యఅతిథిగా డి ఎల్ పి ఓ శ్రీనివాసరెడ్డి










**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలోని కంభంపాడు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం థీమ్ – 5 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి పరిశుభ్రత చర్యలను చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల స్పెషల్ ఆఫీసర్, డీఎల్పీఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గ్రామంలోని రోడ్లు, బజార్లు పబ్లిక్ ప్రదేశాలలో పిచ్చి చెట్లను, ముళ్ళ పొదలను తొలగించి కాలువలలో చేరిన చెత్తను తొలగించి శుభ్రపరిచి శానిటేషన్ చేశారు గ్రామ పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు గ్రీన్ అంబాసిడర్లకు పారిశుద్ధ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డీఎల్పీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఇల్లు షాపులు, పాఠశాలలు, వీధులు పంచాయతీ కార్యాలయాలు ప్రతి చోట శుభ్రపరిచి శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులతో మమేకమై గ్రామాన్ని అభివృద్ధి చేయుటకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని అన్నారు ప్లాస్టిక్ వల్ల పర్యావరణం మట్టి సారాన్ని నాశనం చేయడంతో పాటు నీటి మూలాలను కలుషితం చేస్తుందని పశువులు కలుషిత నీరు తాగడం వల్ల ప్రాణాంతకమవుతుందని అన్నారు ప్లాస్టిక్ కరిగేందుకు వందల ఏళ్ళు పడుతుందని అందుకే ప్రతి గ్రామంలో పూర్తిగా ప్లాస్టిక్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ వనరులను స్థిరంగా వినియోగించుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం కీలకమని తెలిపారు. వ్యర్థాలను నిర్వర్తించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని సూచించారు. చెట్లు పెంచి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించినప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమని, ప్రజల్లో అవగాహన పెంచే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన సూచించారు గ్రామ ప్రజలతో మమేకమై మరింత పారదర్శకతతో ప్రణాళికను రూపొందించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, పంచాయతీ సర్పంచ్ మర్రి రామయ్య, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, క్రాప్ మిత్ర సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలి పాడ్యమి



**దొనకొండ నవంబర్ 21 పెన్ పవర్**

మండల కేంద్రంలో విరాట్ నగర్ లోని శ్రీ ఆనంద ఆశ్రమంలో పోలిపాడ్యమి పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజాము ఐదు గంటలు నుండి మహిళలు ఆశ్రమ ఆవరణలో ఓంకారం శివలింగాకారం స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించి తులసి కోట దగ్గర పసుపు నీటితో అలికి అష్టదళ పాదపద్మము ముగ్గులు వేసి పసుపు కుంకుమతో అలంకరించి దీపాలు పెట్టారు తదనంతరం ఆశ్రమ ఆవరణ బావిలో పసుపు కుంకుమ గంధం అక్షతలు సమర్పించి అరటి డొప్పలో దీపాలు వెలిగించి నీటిలో వదిలారు తదనంతరం నారికేల నైవేద్యం సమర్పించి సామూహిక హారతులు ఇచ్చారు ఈ కార్యక్రమంలోఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ భైరవానంద స్వామి భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

### నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని, సత్వారమే పరిష్కరించాలని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలొఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను అయన స్వీకరించి సంబందించిన సమస్యలపై అధికారులతో మాట్లాడారు. ప్రజలు వారి సమస్యలు పరిష్కారం కోసం అధికారుల చుట్టు తిరగకూడదని, మనం ప్రజల కోసం పని చేస్తున్నామని గ్రహించాలని అన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజలు నమ్మకంతో వున్నారని నిర్లక్ష్యంతోఏ అధికారి వ్యవహరించకూడదని అన్నారు. గతంలో ప్రజలు కార్యాలయాల చుట్టు తిరిగి వేసారి పోయారని ఆ పరిస్థితి రాకూడదనే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లొ ఏ యం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలులో కురిసిన ఒక మోస్తరు వర్షం

**శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో కురిసిన వర్షం.**



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 21**

కొమరోలు మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు లేకుండా ఆకస్మికంగా వర్షం ప్రారంభం కావటంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘాలతో నిండి వాతావరణం చల్లగా ఉంటూ వచ్చింది. అయినప్పటికీ వర్షం కురిసే సూచనలు ఎక్కడా కనిపించకపోవడంతో ప్రజలు వర్షం కురుస్తుందని ఊహించలేదు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో ఉరుములు మెరుపులు లేకుండా వర్షం కురిసింది. దీనితో రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. సిమెంట్ రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది .లోతట్టు రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. అరగంట పాటు కురిసినప్పటికీ రోడ్లన్నీ జలమయమయ్యాయి.

## ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా చెరువుల్లో చాప పిల్లలు విడుదల చేసిన మంత్రి స్వామి






**టంగుటూరు, పెన్ పవర్ నవంబర్ 21**

టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం, మల్లవరపాడు చెరువుల్లో ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా చాప పిల్లలు విడుదల చేసిన మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా నిలిచినది తెలుగుదేశం ప్రభుత్వం. చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధిని పెంచుతున్నాం, కడలి పుత్రులు మత్స్యకారుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారు. మత్స్యకారు లకు వేట నిషేధ సమయంలో రు20వేలు బృతి ఇస్తున్నాం, సబ్సిడీ వలలు, మోటర్ బోట్లు అందజేస్తున్నాం. మత్స్యకారులు బీమా సౌకర్యం కల్పించి ప్రమాద వశాత్తు మరణించిన వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం, తుఫాను సమయంలో మత్స్యకారులకు నిత్యవసర సరుకులు , బృతి పంపిణీలో పాటు అన్ని విధానా అండగా ఉన్నామని మంత్రి చెప్పారు.

# పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ జె. ప్రసాదరావు





**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలోని విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో మండల విద్యాశాఖాధికారి జె. ప్రసాదరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు మండలంలోని శీలంవారిపల్లి కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 2 మరియు నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. హాజరు శాతం, తరగతి గదిలో బోధన పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న భోజన నాణ్యతను, వంటశాల పరిశుభ్రతను సమగ్రంగా తనిఖీ చేశారు. విద్యాబోధనను పరిశీలించారు విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, పాఠశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, బోధన పద్ధతులు, ఉపాధ్యాయుల పట్ల తమ అభిప్రాయాలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ లతో చర్చించారు ఈ కార్యక్రమంలో కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 2 ప్రధానోపాధ్యాయులు బోడే ప్రసాదు, నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చౌడేశ్వరి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయినీలు ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

## పశువుల సంరక్షణ మరియు రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025లో భాగంగా పశువుల సంరక్షణ మరియు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కోవిలంపాడు, మిట్టపాలెం గ్రామాలలో పశువైద్య సహాయకురాలు అమృత సహకారంతో, గ్రామాలలోని గేదెలకు రేడియం మెడ బ్యాండ్‌లను విద్యార్థులు కట్టారు. జాతీయ రహదారి సమీపంలో రాత్రిపూట పశువుల మరణాలు పెరుగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు.పశువులను కాపాడుకోవడానికి రేడియం మెడ బ్యాండ్‌లను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ బ్యాండ్‌లు డ్రైవర్లు చీకటిలో జంతువులను గమనించడానికి సహాయపడతాయని, ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పై కూటమి నేతలు అక్కసును వెళ్లగక్కడమే పనిగా పెట్టుకున్నారా?

### జగన్ పై తగ్గని ప్రజాభిమానం సయ్యద్ గౌస్ మోహిద్దీన్..



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్, నవంబర్ 21**

మార్కాపురం వైసిపి అధినేత మాజీ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్ వెళ్ళిన నేపథ్యంలో అభిమానంతో ప్రజలు ఆయన్ని చూసేందుకు వచ్చారని,దుర్బుదీతో ఆలోచించే టీడీపీ నేతలకు జనాభిమానం అంటే ఏం తెలుస్తుందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటన లో విమర్శించారు.ఈ సందర్భంగా వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతు చంద్రబాబుకు లేని ప్రజాభిమానం జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందన్న ఆసూయ టీడీపీ నేతల్లో గూడుకట్టుకొందన్నారు.జగన్ కు ఉండే ప్రజాభిమానం చూడలేక,ఓర్వలేక టీడీపీ నేతలు ఆసూయతో విమర్శలు చేస్తున్నారని ఆయన ఏద్దేవా చేశారు. వాస్తవాన్ని ఒప్పుకోవడం టీడీపీ నేతలు అలవాటు చేసుకోవాలన్నారు. లేకపోతే కడుపుమంటతో టీడీపీ నేతలు కుమిలి పోవటం తప్పా మరో మార్గం వారికి లేదన్నారు. ఆసూయ పూరిత విమర్శలు పక్కనపెట్టి ఏపీలో పాలనను టీడీపీ నేతలు గాడిలో పెడితే బాగుంటుందని ఆయన సూచించారు.

## నర్సరీ యజమానులు నారు కొనుగోలు చేసే రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి





**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 21**

కొమరోలు మండలంలోని తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న షెడ్నెట్ నర్సరీలను గిద్దలూరు ఉద్యమ శాఖ అధికారిని శ్వేత సందర్శించి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆమె నర్సరీల యజమానులకు సూచనలు సలహాలు ఇచ్చారు. నారు కొనుగోలు చేసే రైతులకు నర్సరీల యజమానులు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. యజమానులు నారుకు సంబంధించిన రిజిస్టర్ లను నిర్వహించాలని ,నాణ్యమైన నారును మాత్రమే రైతులకు విక్రయించాలని కోరారు .నర్సరీల చుట్టూ చెత్త మొక్కలు లేకుండా చేసుకోవాలని, మొక్కలు కొనుగోలు చేసిన రైతులు వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే నర్సరీ యజమానులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని శ్వేత హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రవి , నర్సరీల యజమానులు పాల్గొన్నారు.

# మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

## ఎర్రగొండపాలెం లో అఖిలపక్ష పార్టీలు ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు రౌండ్ టేబుల్ సమావేశం





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 21**

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ షేక్ సైదా,సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు అందే నాసరయ్యలు అన్నారు.శుక్రవారం ఎర్రగొండపాలెం లోని స్థానిక ఎన్జీవో హోం నందు అఖిలపక్ష పార్టీలైన కాంగ్రెస్ సిపిఐ సిపిఎం ఆమ్ ఆద్మీ బి.ఎస్.పి వి.సి.కె పార్టీ ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు రైతు సంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఎర్రగొండపాలెం నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ మెడబలిమి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా,సిపిఐ సీనియర్ నాయకులు అందే నాసరయ్య సిపిఎం నాయకులు సోమయ్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేవేండ్ల శ్రీనివాసరావు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వేసపోగు సుదర్శనం ఎంపీజే రాష్ట్ర నాయకులు రజాక్,సిపిఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య లు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలనేది క్రీశే పూల సుబ్బయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పటినుండి మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందని, గత పాలకులు అశాస్త్రీయంగా పార్లమెంట్ కేంద్రంగా జిల్లాలు ఏర్పాటు చేశారని, ప్రజల మనోభావాలు పట్టించుకోకుండా చేశారని వారు అన్నారు. చంద్రబాబు ఎన్నికల వాగ్దానంలో భాగంగా మార్కాపురం జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు ఇటీవలే మంత్రుల సబ్ కమిటీ లో తీర్మానం చేశామని త్వరలో ప్రకటిస్తామని హడావుడి చేశారని అన్నారు.సి ఎస్ పురం మండలం కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు జిల్లా ఊసే ఎత్తలేదు కాబట్టి ఈ వైఖరి మాకు అటు ప్రజలకు అనుమానం వస్తుందని అన్నారు.15 వ తేదీన మార్కాపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించామని, ఈ రోజు ఎర్రగొండపాలెం లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలియజేశారు అలాగే 24వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టాలని, శ్రీశైలాన్ని కూడా మార్కాపురంలో కలపాలని తీర్మానించడం జరిగిందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని మార్కాపురం జిల్లా కొరకు ఐదు నియోజకవర్గాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలంగాణ సాధన తరహాలో ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. వలసలు నివారణ కావాలంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలన్న విద్యార్థులకు యువతకు కల్పన జరగాలంటే, మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయటమే ఏకైక లక్ష్యమని అన్నారు.అనంతరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబును కలిసి జిల్లా ఆవశ్యకతను వివరించి త్వరగా జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కే వి కృష్ణ గౌడ్,బీఎస్పీ నాయకులు రాచిటి ప్రసాద్,విసికె పార్టీ నాయకులు టి అచ్చయ్య,మాల ఐక్యవేదిక అధ్యక్షులు ఎలిసెల కోటేశ్వరరావు ఏపీజెఎసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆలేటి నాగయ్య, రిటైర్డ్ ఎన్జీవో నాయకులు తాళ్లపల్లి సుబ్బారావు,సిపిఐ నాయకులు బి రామయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు డి బాలకృష్ణారెడ్డి ఎస్ కె మహబూబ్ వలీ దళిత ఉద్యమకారుడు కోట డేవిడ్ రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి,దళిత నాయకులు మెడబలిమి మౌంట్ బాటన్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య బీసీ నాయకులు ముటుకూరి వెంకటేశ్వర్లు గజ్జ వెంకటేశ్వర్లు దళిత హక్కుల పోరాట సమితి నాయకులు తిరుమలయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఏకగ్రీవంగా జరిగిన ఉద్యోగుల సంఘం ఎన్నికలు



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 21**

పొదిలిలో శుక్రవారం నాడు ఎన్జీవో అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఉద్యోగుల సంఘం కు సంబంధించిన పోస్టుల కు నామినేషన్లు ఒక్కొక్కటే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షులుగా ఎల్ శ్రీనివాసరెడ్డి, సహా అధ్యక్షులుగా ఎస్ కె నాసర్ వలి, ఉపాధ్యక్షులుగా షేక్ కరీముల్లా, షేక్ అబ్దుల్ ఆరిఫ్, జే వెంకటేశ్వర్లు, ఎస్ కె యూసుఫ్, కళా ప్రపూర్ణ, కార్యదర్శిగా షేక్ సంధాని భాష, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా వి.వి నర్సారెడ్డి, షేక్ గౌసియా, ఎం రమేష్, కె.వి అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కె రమాదేవి, కోశాధికారిగా కె విజయ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కే రవిశంకర్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వి రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి సహాయ ఎన్నికల అధికారిగా షేక్ మహబూబ్ సుభాని, ఎన్నికల పరిశీలకులుగా బి విజయకుమార్ వ్యవహరించారు.

## నేడు కొమరోలు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలు



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 21**

కొమరోలు మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కేంద్రాలలో ఈనెల 22వ తేదీ శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం గ్రామ సభలు నిర్వహించనున్నట్లుగా కొమరోలు ఇన్చార్జి ఏపీఓ ఆర్ మహాలక్ష్మి దేవి తెలిపారు. గ్రామ సభలకు సంబంధించిన వివరాలను షెడ్యూల్ ద్వారా తెలియపరిచామని ,ఆ మేరకు గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు .కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ సభలను విజయవంతం చేసి సద్వినియోగం చేసుకోవాలని మహాలక్ష్మి దేవి కోరారు.

## చిన్నారిని ఆశీర్వదించిన వెన్నా హనుమారెడ్డి



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ నవంబర్ 21**

మార్కాపురం మండలం శివరామపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ గురుబ్రహ్మం కుమార్తె శివజ్యోతి ప్రియా పుష్పలంకరణ వేడుక ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి వైయస్సార్ సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హనుమారెడ్డి పాల్గొనడం సంతోషకరంగా ఉందని గురుబ్రహ్మం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు పోరెడ్డి చెంచి రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడుపుతున్న 33 మందికి జరిమానా

### – ఒంగోలు ట్రాఫిక్ సిఐ జగదీష్ వెల్లడి

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**

విజిబుల్ పోలీసింగ్ వాహనాల తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 33 మంది వాహన చోదకులకు స్థానిక కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం రూ.3,30,000/- జరిమానా విధించినారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ ఎస్. జగదీష్ తెలిపారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వాహన చోదకులు ప్రతి ఒక్కరూ మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలు తప్పక పాటించాలని సి.ఐ సూచించారు.

# జలం.. పెరిగింది బలం

## జిల్లాలో గణనీయంగా పెరిగిన భూగర్భ సిరులు

**యర్రగొండపాలెం, పెన్ పవర్ నవంబర్ 21**



జిల్లాలో ఏళ్లతరబడి ఒట్టిపోయిన భూగర్భానికి జీవం వచ్చింది. దశాబ్దాలుగా ఎన్నడూ లేనంతగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ఎక్కడ చూసినా జలవనరులు తొణికిసలాడుతున్నాయి. మీటర్ల కొద్దీ దిగజారిన భూగర్భజలాలు ఏకధాటిన పుంచుకున్నాయి. ఒట్టిపోయిన బోర్లు సైతం ప్రాణం పోసుకుని జలధారలు కురిపిస్తున్నాయి.గత అక్టోబరుతో పోల్చితే ఈ అక్టోబరు నాటికి భూగర్భ జలమట్టం బాగా పెరిగింది. కరవుతో అల్లాడే పశ్చిమ ప్రాంతానికి జీవం వచ్చిందనే చెప్పాలి. ఎన్నడూ లేనంతా ఇక్కడ వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గతేడాది అక్టోబరు నాటికి భూర్భజలమట్టం సరాసరి 16.97 మీటర్లు ఉండగా, ఈ ఏడాది అక్టోబరు నాటికి 11.86 మీటర్లకు చేరింది. అంటే 5.12 మీటర్ల పెరుగుదల కనిపించింది.


**పెరిగిన వర్షపాతం... :** జిల్లాలో భూగర్భ జలాల రూపంలో 44.66 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి ఈ నెల 20వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 694.6 మి.మీ కాగా, 800.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 15.3 శాతం అదనంగా నమోదైంది. జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మరో 19 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**నిండుకుండల్లా చెరువులు**

జిల్లాలో మొత్తం 785 చెరవులుండగా, 33 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. 75 శాతం నిండినవి 27 చెరువులుండగా, 50 శాతం నిండినవి 72, 25 శాతం నిండినవి 330 ఉన్నాయి. వీటిల్లో నీటి నిల్వ సామర్థ్యం: 14,068.16 ఎంసీఎఫ్టీ (వెయ్యి ఎంసీఎఫ్టీలు ఒక టీఎంసీ) కాగా, ప్రస్తుతం 5,239.78 ఎంసీఎఫ్టీలు (5.2 టీఎంసీలు) నిల్వలున్నాయి. గతేడాది ఇదే సమయానికి 2,176.24 ఎంసీఎఫ్టీలు కాగా, గతేడాది ఈ ఏడాదికి నిల్వల పెరుగుదల 3,063.54 ఎంసీఎఫ్టీలుగా నమోదైంది.

# జిల్లాకు వర్ష సూచన..

## రైతులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**గుంటూరు, పెన్ పవర్ నవంబర్ 21**

గుంటూరు జిల్లాలో ఈ నెల 27, 28 తేదీల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. పంటలు సురక్షితంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరి పంట కోతలు కోసిన రైతులు పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సహకరించాలని, తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 21**

మండలంలో ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అతి తక్కువ సమయంలోనే రికవరీ చేసిన బాధితులకు శుక్రవారం పుల్లల చెరువు పోలీసు స్టేషన్ లో ఎస్ఐ సంపత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ వెబ్సైట్లో నమోదు చేసుకున్న బాధితుల వివరాల మేరకు విచారణ చేపట్టి, రికవరీ చేసి అందిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.మొబైల్ ఐఎంఈఐ నెంబర్ల సహాయంతో మొబైల్ను ట్రాక్ చేసి పట్టుకుంటున్నట్టు ఆయన తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రెండు ఫోన్లను రికవరీ చేసి బాదితులకు ఇచ్చామని ఎస్ ఐ సంపత్ కుమార్ తెలిపారు. ఫోన్ సెక్యూరిటీ లాక్ వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్లో ఉంచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

## ఒంగోలు కొప్పుల చెరువు వద్ద పోలి పాడ్యమి వేడుకలు



**ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**

కార్తిక మాసం ముగింపులో భాగంగా పోలి పాడ్యమి వేడుకలను తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఒంగోలు నగరంలోని కొప్పుల చెరువులో భక్తులు దీపాలు వెలిగించి చెరువులో వదిలారు.

# కనక మహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలకు శుభారంభం





**ప్రత్యేక పూజలతో వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 21 :**శ్రీ శ్రీ శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు శుక్రవారం భక్తినిష్ఠగా ప్రారంభమయ్యాయి. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, గర్భగు డిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత రం అమ్మవారి మండపంలో మార్గశిర మాస పూజను సాంప్రదాయంగా చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడు తూ, "కోరికలు తీర్చే అమ్మవారి మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం చేయడం నా పూర్వ జన్మ సుకృతం" అని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కు వగా ఉండే ఈ మాసంలో దాదాపు 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొ న్నారు. పోలి పాడ్యమి కావడంతో ఇప్పటి నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా దేవస్థానం అన్ని ఏర్పాట్లను చేపట్టిందని, ముఖ్యంగా అదనపు ప్రసాద కౌంటర్లు ఏర్పా టు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. నెల రోజు ల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో ప్రతి భక్తుడు సులభంగా దర్శనం పొందేలా దిశానిర్దేశాలు జారీ చేశామని తెలిపారు. కనక మహాలక్ష్మి అమ్మ వారి అనుగ్రహం విశాఖకు, ఆంధ్రప్రదేశ రాష్ట్రానికి ఎల్లప్పుడూ ఉండాలి. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సకల ఐశ్వర్యాలతో ఉండా లని అమ్మవారిని మనసారా ప్రార్థించాను" అని ఎమ్మెల్యే అన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఏఈఓ ఆనంద్, రాజేంద్ర, ఈఈ రమణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు






**ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీ శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలకు సర్వం సిద్ధం**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 21**: పంచామృతాభిషేకం కలశస్థాపన,మండపారాధన, కుంకుమార్చన,వస్త్రాలంకరణ, దివ్య హారతితో తూర్పు నియోజకవర్గం ఆరిలోవ కాలనీ కనకమహాలక్ష్మి నగర్ లో శుక్రవారం ఆలయ అర్చకులు మురళి అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించి కలశ స్థాపనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు సిహెచ్ సాయిబాబు కార్యదర్శి కేశవరావు మాట్లాడుతూ. ఈనెల 27 నుంచి మొదలుకొని డిసెంబర్ నెలలో 18 వ తారీకు వరకు నిర్వహించే మార్గశిర మాసోత్సవాలు ఆలయ కమిటీ భక్తుల కోసం అని ఏర్పాట్లు చేసిందని, శుక్రవారం అమ్మవారి పంచాబురు పంచామృతాభిషేకం,కలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభించామని, మార్గశిర మాసంలో శుక్రవారం లో అమ్మవారికి ఉదయం 10 గంటల నుండి విశిష్ట పూజలు శుక్రవారం జరుగుతాయని భక్తులందరూ విశిష్ట పూజల్లో పాల్గొనవలసిందిగా వారు తెలియజేశారు. మార్గశిర మాసంలో భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కరుణ కటాక్షాలకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# దారేల సచివాలయం పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు





**– డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్క్రీనింగ్.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబరు 21.**మండలంలో గల దారెల సచివాలయం పరిధిలో వైద్యులు నిఖిల్ ఆధ్వర్యంలో చిన్నారుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో ప్రతి ఒక్క పిల్లవానికి న్యూమోనియా గురించి స్క్రీనింగ్ చేశారు. నవజాత శిశువులు, పిల్లలకు తల్లులు సంరక్షణ విధానాన్ని గూర్చి వివరించారు. చలికాలంలో పిల్లల పట్ల తల్లులు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో, న్యూమోనియాని త్వరగా ఎలా గుర్తించాలో, పిల్లల యొక్క శ్వాస విధానంలో ఏదైనా తేడా జరిగితే ఎలా గుర్తించాలనే దానిపైన అవగాహన కల్పించినట్లు వైద్యులు తెలిపారు. సంవత్సరంలోపు పిల్లలు 11మందితో పాటు సంవత్సరం వయసు దాటిన 12 మంది చిన్న పిల్లలను స్క్రీనింగ్ చేశామన్నారు. పంచాయతీ పరిధిలో గల కోడపుట్టు, పాతునిపుట్టు, వర్ధన్ పుట్టు, పెద్దపుట్టు, చివుకుచింత గ్రామానికి చెందిన పిల్లలకు స్క్రీనింగ్ చేశామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాపురం మరిడిమాంబ కళ్యాణ మండపంలో జాబ్ మేళా









**జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు**

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా కీలక అడుగు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 21 :** విశాఖపట్నం, మల్కాపురం, మరిడిమాంబ కళ్యాణ మండపంలో నిర్వహించిన జాబ్ మేళాను పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ గణబాబు ఘనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగ యువత సంఖ్య ఎక్కువ. అందుకే ప్రతి మూడు నెలలకు ఒకసారి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తాం. ఈరోజు నిర్వహించిన మేళాలో సుమారు 25 కంపెనీలు పాల్గొనడం విశేషం" అని చెప్పారు.

**యువతకి మరిన్ని అవకాశాలు..**

నిరుద్యోగులు, ఉద్యోగార్థులు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందితే పరిశ్రమల్లో మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన సూచించారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇలాంటి జాబ్ మేళాలు యువతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

**విశాఖలో పెట్టుబడుల పెరుగుదల – పరిశ్రమల విస్తరణ..**

ఇటీవలి కాలంలో విశాఖపట్నం వైపు అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని గణబాబు తెలియజేశారు.
"పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు విశాఖలో నిర్వహించిన సిఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషికి నిదర్శనం. పరిశ్రమలు వస్తే యువతకు అధికంగా ఉద్యోగావకాశాలు సృష్టించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి ప్రభుత్వ నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు.

# రోలుగుంటలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు కోసం వినతి పత్రం




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకే వీధి మండలం, దారకొండ పంచాయితి రోలుగుంట గ్రామంలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రోలుగుంటలో సుమారు 25 కుటుంబాలు, 160 మంది జనాభా ఉండగా, 5 ఏళ్లు దాటిన చిన్నపిల్లల సంఖ్య 20 మంది ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుత అంగన్వాడి కేంద్రం గ్రామం నుండి సుమారు ఒక కిలోమీటర్ దూరంలో ఉండడం వలన పిల్లలు చిన్న గంగవరం వాగు దాటిన తరువాత మాత్రమే చేరవలసి, వర్షాకాలంలో ఇది ప్రమాదకరమవుతుందని, పిల్లలకు ప్రీ స్కూల్, ఆటలు లేక ఇండ్లకే పరిమితం అవుతున్నాయని విన్నతి పత్రంలో పేర్కొన్నారు. తల్లితండ్రులు పనులకు వెళ్ళినప్పుడు పిల్లలను కూడా తీసుకెళ్ళాల్సి వస్తున్న పరిస్థితి ఉందని కూడా తెలిపారు. వినతి పత్రంలో రోలుగుంటలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేసి, ఒక టీచర్ నియమించి చిన్నపిల్లలకు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిల్లో బలరాం, డి. జయరాం తదితరులు పాల్గొన్నారు.

# మండపల్లి, మర్రిపాకలు, జర్రిగొంది గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 21:**జీకే వీధి మండల మాజీ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ, కొయ్యూరు మండలం యు.చీడిపాలెం, మఠం, బీమవరం పంచాయతీల మర్రిపాకలు, జర్రిగొంది, మండపల్లి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. అందులో మంజూరు అయిన రోడ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించబడకపోవడం వలన గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. జర్రిగొంది గ్రామ ప్రజలు రేషన్ బియ్యం కోసం సుమారు 30 కిలోమీటర్లు నడిచి, కాలువలు దాటిన తరువాత జిసిసి డిపోకు వెళ్లి బియ్యం తీసుకోవాల్సి వస్తోంది. అందువల్ల, పెద్ద అగ్రహారం జిసిసి డిపోలో వారి రేషన్ కార్డులను సరిపడే విధంగా మార్పు చేయాలని కూడా ఆమె అభ్యర్థించారు. మంజూరు అయిన రోడ్ల నిర్మాణాలను ఈ ఏడాది లోపు ప్రారంభించి పూర్తి చేయాలని, గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, తద్వారా స్థానిక ప్రజల సమస్యలను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# కాకతీయ పాడి పబ్లిక్ స్కూల్ 42వ వార్షికోత్సవంలో : పల్లా






**గాజువాక: పెన్ పవర్, నవంబర్ 21**

పిల్లలు విద్యార్థి దశ నుండే సేవ గుణం అవాలంబించుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక కాకతీయ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ , స్కూల్ 42వ వార్షికోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం చేసినందుకు స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల ఎదుగుదలకు క్రమశిక్షణ ప్రధాన పాత్ర పోసిస్తాదని, పిల్లలకు క్రమశిక్షణ అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల వలన కూడ రావాలని అన్నారు. గత 42 ఏళ్లుగా గాజువాకలో కాకతీయ స్కూల్,విద్యార్థులను ఉన్నత స్థితిలో వుండే దిశగా సేవాలాందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మాండవ రవికుమార్, డైరెక్టర్ మాండవ ప్రణీత్, శ్రవణ్ షిప్పింగ్ అధినేత సాంబశివరావు, దస్పల్ల గ్రూప్ అధినేత రాఘవేంద్రరావు ,స్కూల్ ప్రిన్సిపాల్ పీవీ ధనలక్ష్మి, స్కూల్ జనరల్ మేనేజర్ ఝాకీ అహ్మద్ ఖాన్, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# 13 వ వార్డు లో పోలి పాడ్యమి అన్నసమారాధన



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 21**:జీవీఎంసీ 13 వ వార్డు లో కార్తీక మాస పోలి పాడ్యమి పర్వదిన సందర్భంగా ఆరిలోవ ఉమా రామలింగేశ్వర ఆలయం వద్ద మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని స్వామి వారిని దర్శించుకకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధన ప్రసాదాన్ని భక్తులకు అందించారు ఈ కార్యక్రమం లో వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,టిడిపి సీనియర్ నాయకులు,ఆలయ కమిటీ అధ్యక్షులు పాత్రకండ దర్మారావు. వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి,స్థానిక సంఘ పెద్దలు, టీడీపి కార్యకర్తలు,ఆలయ కమిటీ భక్తులు పాల్గొన్నారు.

## కందుకూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్రాణిని



**కందుకూరు పెన్ పవర్ నవంబర్ 21:**
కందుకూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ గా డాక్టర్ ఇంద్రాణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం డాక్టర్ శకుంతల సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి తప్పించమని ఆమె కోరినట్లు తెలిసింది. దాంతో డాక్టర్ ఇంద్రాణిని అధికారులు నియమించారు. గతంలో కూడా ఇంద్రాణి సూపరింటెండెంట్ గా బాధ్యతలు నిర్వహించారు. దీంతో పలువురు డాక్టర్ ఇంద్రాణికి అభినందనలు తెలిపారు.

## జీ జీ హెచ్‌లో వసతులపై డి ఆర్ ఓ బృందం తనిఖీ





**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**
ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రి (జిజిహెచ్)ని సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణను శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి బి. సిహెచ్. చిన ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిజీహెచ్ సుపరింటెండెంట్ లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో రోగులకు అందిస్తున్న వసతులు, ఉన్న సైడు మురుగు కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ వారి సూచనలతో జిజిహెచ్ ను సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుద్ధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణ, పరిశీలించడం జరిగిందని, దీని పై జిల్లా కలెక్టర్ వారికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు, జిజీహెచ్ సుపరింటెండెంట్ డా. మాణిక్య రావు, జిజిహెచ్ వైద్యులు తదితరులు ఉన్నారు.

## బీసీ.. ఎస్సీ.. ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

### - ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలి


### - ఏ పి బి సి స్టడీ సర్కిల్ సంచాలకులు ఎస్ నిర్మలా జ్యోతి

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**
సివిల్ సర్వీసెస్ పరీక్షల ఉచిత శిక్షణకు ప్రకాశం జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఒంగోలు ఎ.పి. బి.సి. స్టడీ సర్కిల్ సంచాలకులు యస్. నిర్మలా జ్యోతి ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 17 వ తేది నుండి 25 వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబర్-5వ తేదిన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, స్క్రీనింగ్ టెస్ట్ లో అర్హత సాదించిన అభ్యర్థులకు డిసెంబర్-10 వ తేది నుండి ఉచిత శిక్షణా తరగతులు ఎ.పి.బి.సి. స్టడీ సర్కిల్, గొల్లపూడి, విజయవాడ నందు జరుగుతాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ పదవ తరగతి మార్కుల నకలు, ఇంటర్ మార్కుల నకలు, డిగ్రీ మార్కుల నకలు, స్టడీ సర్టిఫికెట్స్ నకలు, కుల ధృవీకరణ పత్రం నకలు, ఆదాయ ధృవీకరణ పత్రం నకలు(1,00,000/- లోపు), ఆధార్ నకలు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 17 వ తేది నుండి జిల్లా కలెక్టరు వారి కార్యాలయము ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్ లో ఉన్నటువంటి ఎ.పి.బి.సి. స్టడీ సర్కిల్, ఒంగోలు నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరములకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు ప్రకాశం జిల్లా ఆఫీసు ఫోన్ నెంబర్ 08592-231232, 9989285530, 8985090926 ను సంప్రదించాలని తెలిపారు.

# నగరంలోని భవనాలను క్రమబద్ధీకరించుకోవాలి

## ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే.వెంకటేశ్వరరావు





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 21**
ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివియేషన్ భవనం, అనధికారికంగా నిర్మించిన భవనాలు అన్నింటినీ తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో శుక్రవారం ఎల్టిపిలు, పట్టణ ప్రణాళిక సిబ్బందితో సమావేశ నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన బిపిఎస్, ఎల్ఆర్ఎస్ స్కీముల గురించి చర్చించారు. ఎల్టిపీలు అందరూ కూడా వారి దగ్గరకు వచ్చిన దరఖాస్తుదారులకు బిపిఎస్, ఎల్ఆర్ఎస్ స్కీముల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివియేషన్ భవనం, అనధికారకంగా నిర్మించిన భవనాలు అన్ని తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. బి పి ఎస్ లోకి వచ్చిన ప్రతి భవనం యొక్క మార్ట్ గేజ్ ను రిలీజ్ చేస్తారన్నారు. సదరు భవనాలకు ప్రాపర్టీ టాక్స్ తగ్గిస్తారని, బిపిఎస్ చేయించుకోనీ సదరు భవనాలకు వాటర్ సప్లై కనెక్షన్ తొలగించి, ఆయా భవన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. బిపిఎస్ స్కీమ్లో బిల్డింగ్స్ కి 10% డివియేషన్ లోపల వాటికి ప్రాపర్టీ టాక్స్ 10% అధికంగా ప్రాపర్టీ టాక్స్ వేయడం జరుగుతుందని తెలిపారు. 10% డివియేషన్ పైన ఉన్న బిల్డింగ్స్ కి 50% అధికంగా ప్రాపర్టీ టాక్స్ వేస్తారని తెలిపారు. ఎల్టిపీలు ఈ స్కీం గురించి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. బిపిఎస్ స్కీమ్ కి చివరి తేదీ 11 మార్చి 2026 అన్నారు. ఈ స్కీమ్ ద్వారా సుమారు 70 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎల్ఆర్ఎస్ కి ద్వారా అనధికార లేఔట్లను అధికార లేఅవుట్లుగా మార్చుకోవచ్చు అని తెలిపారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో అనధికారం లే అవుట్ లలో డ్రైనేజీ, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరగదు అని ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ స్కీమ్ లో అప్లై చేసి వాటిని ఆమోదం చేసుకోవడం వలన ఆయా లేఔట్ లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా 30 కోట్ల ఆదాయం సమకూర్తుంది అన్నారు. ఈ స్కీమ్ దరఖాస్తుకు ఆఖరు తేది 26 జనవరి 2026 గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామ్ భూపాల్ రెడ్డి, ఎసిపి సుధాకర్ రావు, టిపిఓ బాబురావు, టీపీఎస్ రసూల్, రెవెన్యూ ఆఫీసర్ విజయభాస్కర్, ఆర్ ఐలు, నగరంలోని ఎల్టిపీలు పాల్గొన్నారు.

## వరి ధాన్య సేకరణకు రైస్ మిల్లర్స్ సహకరించాలి

### - జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 21**
జిల్లాలో వరి ధాన్య సేకరణకు రైస్ మిల్లర్స్ సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో జిల్లాలో వరి ధాన్యం సేకరణపై పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రబీ సీజన్ లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు. జిల్లాలో రైస్ మిల్లర్ల ప్రతినిధులు ధాన్య సేకరణకు రైస్ మిల్లులను సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. వరి ధాన్య సేకరణకు అవసరమైన ఖాళీ గోతాలను సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. వరి ధాన్య సేకరణకు అవసరమైన బ్యాంక్ గ్యారంటీలను ప్రభుత్వానికి ఇవ్వాలని ఆయన చెప్పారు. జిల్లాలో 44 రైతు సేవ కేంద్రాల ద్వారా 26 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా వరిధాన్యం సేకరణ చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు. జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ డి.ఎం వరలక్ష్మి, డి.ఎస్.ఓ పద్మశ్రీ, రైస్ మిల్లర్ల ప్రతినిధి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానవ హక్కుల కమిషన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గా డాక్టర్ షేక్ మహబూబ్ వలి

### మానవ హక్కుల సంరక్షణ కోసం తోడ్పడతా

### మహబూబ్ వలికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు

**మార్కాపురం ఆర్.సి ఇంచార్జీ పెన్ పవర్ నవంబర్ 21**
ప్రపంచ మానవ హక్కుల కమిషన్ భారతదేశం వైస్ ప్రెసిడెంట్ గా ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ షేక్ మహబూబ్ వలి నియమితులయ్యారు.ఈ మేరకు ఆయనకు శుక్రవారం ప్రపంచ మానవ హక్కుల కమిషన్ ప్రపంచ కార్యాలయం నుండి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.ప్రపంచ మానవ హక్కుల కమిషన్ తన సందేశంలో డాక్టర్ షేక్ మహబూబ్ వలి కి మానవ హక్కుల కమిషన్ లో జీవితకాల సభ్యత్వము,దేశ ఉపాధ్యక్షుడిగా జీవితకాలం కొనసాగుతారని తెలిపారు.నవంబర్ 27 - 2025 న అధికారిక నియమక పాత్రన్ని ఇవ్వనున్నారని తెలిపారు.ఈ సంస్థ ద్వారా డాక్టర్ షేక్ మహబూబ్ వలి కి ఒక నేషనల్ అవార్డు రాష్ట్రీయ అశోక్ సన్మానం



అవార్డును ప్రధానం చేయనున్నారని పేర్కొన్నారు.ఈ అవార్డు డాక్టర్ వలి 110వ అవార్డు కావడం విశేషం.డాక్టర్ మహబూబ్ వలి సమాజం కోసం చేస్తున్న సేవలను గుర్తించిన ప్రపంచ మానవుల హక్కుల కమిషన్ ఈ బాధ్యతను ఇస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ ఈ బాధ్యతలను అప్పజెప్పిన ప్రపంచం మానవ హక్కుల కమిషన్ సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.మానవ హక్కులను కాపాడడానికి సాయ శక్తుల కృషి చేసి సంస్థ అభివృద్ధి కోసం తోడ్పడతానని తెలిపారు.ఇప్పటికే డాక్టర్ షేక్ మహబూబ్ వలి సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సంస్థ,కరప్షన్ ఫ్రీ ఇండియా,యోగ్దానం సహారా సమితి ఈ మూడు సంస్థలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గా కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ షేక్ మహబూబ్ వలి నియామకంపై పలువురు మిత్రులు,సన్నిహితులు, ప్రముఖులు మహబూబ్ వలికి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలోత్సవ్ పోటీలలో పాల్గొనేందుకు 30వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలి

### - నెక్స్ట్ జన్ స్కూలు యాజమాన్యం వెల్లడి

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 21**
విద్యార్థులలో దాగివున్న వివిధ ప్రతిభలను వెలికి తీయడం కోసం నెక్స్ట్ జెన్ బాలోత్సవ్ పేరిట ఒంగోలులోని ప్రసిద్ధ విద్యాసంస్థ నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో మొత్తం 67 విభాగాలలో 23 రంగాలలో సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నదని స్కూల్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, వక్తృత్వం, కథలు చెప్పటం ఇటువంటి ఎన్నో విభాగాలలో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని రాష్ట్రస్థాయిలో ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం మన ప్రాంతాల్లో ఇదే మొదటిసారి అని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా అర్హులే అని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనడం పూర్తిగా ఉచితం అని, డిసెంబరు 6 , 7 , 13 , 14 తేదీలలో ఈ పోటీలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేయబడిందని తెలిపారు. బాలోత్సవ్ ప్రచారానికి సంబంధించిన గోడపత్రికలను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ విడుదల చేశారు. సమావేశంలో స్కూల్ డైరెక్టర్లు డా. మురళీధర్ రెడ్డి, కె. అరవింద, ప్రిన్సిపాల్ డా. ఆర్.ఎల్.వి.రమేష్, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనాలి అనే ఉద్దేశంతో ఆన్లైన్లో నమోదు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 30 గా మార్పు చేసినట్లు వారు తెలియజేశారు. మిగిలిన సమాచారం కొరకు 7660005774/ 7660001368 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఆన్ లైన్ లింక్ https://forms.gle/z7otMnvdwXn8ehADA ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## మాలధారణ స్వాములకు బిక్ష వసతి కల్పించిన వడ్లమాని ఆరుద్ర



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 21**
మండల కేంద్రం సి ఎస్ పురం లోని పామూరు వెళ్లే రహదారి నందు గల అయ్యప్ప స్వామి పీఠంలో శుక్రవారం సి.ఎస్.పురం పట్టణానికి చెందిన ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారి -ఆదినారాయణమ్మ దంపతులు కుమారుడు ఆరుద్ర అయ్యప్ప స్వామి మాలధారణ స్వాములకు బిక్ష వసతి కల్పించారు. ఈ సందర్భంగా వడ్లమని నారాయణ చారి కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు ఈ సందర్భంగా మాలధారణ స్వాములు నారాయణచారి కుటుంబాన్ని అయ్యప్పస్వామి పీఠం శేష వస్త్రాలతో సత్కరించి, వారికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు.ఈ సందర్భం గా వడ్లమాని నారాయణచారి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సన్నిధిలో సేవ చెయ్యడం మా అదృష్టం మాలధారణ స్వాములకు అండగా నిలిచి సేవ చేయాలనే ఆలోచన స్వామివారి ప్రేరణ మానవసేవే మాధవసేవ అయ్యప్ప స్వామిని స్మరించే వారికి ఆయుష్షు ఆరోగ్యం ఆధ్యాత్మిక బలం దక్కాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మాలధారణ స్వాములు, భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# యాంటీబయోటిక్స్ అతి వాడకం ప్రమాదకరం






**రాజమహేంద్రవరం, పెన్ పవర్ నవంబర్21 :** యాంటీమైక్రోబియల్ రెసిస్టన్స్ అవగాహన వారోత్సవాలు శుక్రవారం స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల నుంచి 24 వరకు జరుగుతున్న "ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవేర్‌నెస్ వారం" సందర్భంగా, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ (జీఎంసీ), లో వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా కె. శివ ప్రసాద తెలియ చేశారు. దీనిపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు డిబేట్ పోటీలు, పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. మెడిసిన్ 2వ సంవత్సరం విద్యార్థి కె. ప్రియతమ్, ఏ ఎం ఆర్ పై ప్రభావవంతమైన పోస్టర్ రూపొం దించారు. తదుపరి దేవ్ ఆదిత్య థోమర్, మెడిసిన్ 3వ సంవత్సరం – డిబేట్ పోటీలో యాంటీబయోటిక్స్ విశ్లేషణాత్మక ప్రదర్శన ఇచ్చారు. పోటీల్లో పై సమాజం ఎందుకు స్పందించాలి అనే అంశంపై పోటీదారులు శాస్త్రీయంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసి, ప్రజల్లో అవగాహన పెంపు అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రజా బాధ్యతగా వ్యవహరించి, యాంటీబయోటిక్స్‌ను అవసరం ఉన్నప్పుడే వాడాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈనెల 21న ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో నిపుణులు పేర్కొన్నారు. మైక్రోబయాలజీ విభాగం అధిపతి డా. యం. భారతీ యాంటీ మైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ ప్రాముఖ్యతను వివరించారు. యాంటీ బయోటిక్స్‌ను తప్పుగా, అధికంగా వాడటం మానవాళి ఆరోగ్యానికి పెను ముప్పని హెచ్చరించారు. కమ్యూనిటీ మెడిసిన్ అధిపతి డా. బి. శ్రీనివాస్ నాయక్ విచ్చలవిడిగా యాంటీబయోటిక్ వాడకాన్ని తగ్గించకపోతే భవిష్యత్ తరాలు తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటాయని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా. వి.వి. దుర్గాప్రసాద్, మానవులు మాత్రమే కాదు, పెంపుడు జంతువులకు కూడా అనవసర యాంటీబయోటిక్స్ ఇవ్వడం నివారించాలన్నారు. పర్యావరణ సమతౌల్యం కాపాడగలమని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సి. హెచ్. ఉదయ్ కుమార్, డా. పి. సుశీల, డా. ఆనంద్ సత్యతేజ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## స్టూడెంట్ ఎమ్మెల్యేగా లోకేష్ - అభినందించిన ఎమ్మెల్యే సత్యానందరావు



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 21:** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో ఈ నెల 26న జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీకి అలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి అనసూరి లోకేష్ కుమార్ స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో లోకేష్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రేరణతో విద్యార్థులకు లభిస్తున్న ఈ అవకాశం ఎంతో విలువైనదని, ప్రతిభావంతులకు మాత్రమే దక్కే గుర్తింపని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని లోకేష్ కుమార్ కు సూచించారు.

కొత్తపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించనున్న లోకేష్‌కు ఎమ్మెల్యే సత్యానందరావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## అంగన్వాడీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు21:** అంగన్వాడీ కార్యకర్తల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో 20మంది అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా అప్గ్రేడ్ చేసిన నియామక పత్రాలను ఆయన శుక్రవారం అందజేశారు.

మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ, కార్యకర్తల జీతాలను రూ.7,000 నుంచి రూ.11,500కి పెంచినందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 20 మందికి అవకాశం లభించిందని, మరో నలుగురు సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం టీచర్లుగా అప్‌గ్రేడ్ అవుతారని చెప్పారు. కొత్తపేట మండలంలో 10 మంది, రావులపాలెం మండలంలో 8 మంది, ఆత్రేయపురం మండలంలో ఇద్దరకి అంగన్వాడీ కార్యకర్తలు టీచర్లుగా పదోన్నతి పొందారని వివరించారు. చిన్నారులకు ఎంతోకాలం సేవ అందించిన వీరికి ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుకు తాము సంతోషిస్తున్నామని అన్నారు.

అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవనాలను త్వరితగతిన పూర్తి చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. స్కూళ్లలో ఖాళీ భవనాలు ఉంటే వాటిని అంగన్వాడీ కేంద్రాలుగా మార్చేందుకు ఐసీడీఎస్ సూచిస్తే మరమ్మతులు చేసి అందజేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## కళ్లాలుగా మారిన ప్రధాన రోడ్లు



**సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 21:** మండలంలోని రాజమహేంద్రవరం వెళ్లే రహదారి వ్యవసాయ కళ్లాలుగా మారడంతో ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ప్రస్తుతం వరి పంట చేలు కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వాహనాలు తిరిగే రోడ్లపై వడ్లు ఆరబోయడం వల్లతరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా వడ్ల కుప్పలు రోడ్లపై ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు ఇక్కట్లుకు గురవుతూ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. రోడ్లపై వడ్ల కుప్పలు వేయడంతో వాహన చోదకులు జారిపడి ప్రమాదానికి గురవుతున్నారు. ఇనగంటి వారి పేట, కాటవరం, ముగ్గళ్ళ , గ్రామాల్లో అధికంగా జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై వడ్ల కుప్పలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు పలువురు కోరుతున్నారు.

## అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్ మీనా**

**409 మంది లబ్ధిదారులకు గృహ రుణ పత్రాల పంపిణీ**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21 :** పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం ఆనం కళా కేంద్రం లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) - 2.0 కింద 409 మంది లబ్ధిదారులకు రూ. 10.22 కోట్ల విలువైన గృహ రుణ మంజూరు పత్రాలను వారు పంపిణీ చేశారు. నగర కమిషనర్ రాహుల్ మీనా సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో నగరంలో రూ.15 కోట్ల వ్యయంతో 3,097 ఇళ్లను నిర్మించి పేదలకు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నుంచి ఇచ్చిన దాఖలాలు లేవని.. కూటమి ప్రభుత్వం రూ. 2.50 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ. లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి సుమారు 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సదరం స్లాట్ బుకింగ్ ఓపెన్ అయిందని, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే జనవరి మాసంలో కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కల అని పేర్కొన్నారు. రాష్ట్రానికి మరో 5 లక్షల నూతన ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ పీఎంఏవై %-% 2.0 ద్వారా ప్రభుత్వం అర్బన్ ఏరియాలలో రూ. 2.50 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ. లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు ఎస్సీ, బీసీ వర్గాలకు అదనంగా రూ. 50 వేలు., ఎస్టీలకు రూ. 75 వేలు., పీవీజీటీలకు రూ. లక్ష అదనంగా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరక్టర్ దాసరి ప్రియ సౌజన్య, పీడీ(హౌసింగ్) బుజ్జి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ యానాపు యేసు, అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఈఈ(ఇంజనీరింగ్) అలీ, ఈఈ(హౌసింగ్) రాజ్ కుమార్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని శబరిమలలో పూజలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో రూరల్ నియోజకవర్గం వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేద ప్రజల కష్టాలు తీరాలంటే రాబోయే రోజుల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ, సీనియర్ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(పార్లమెంట్) ప్రముఖ న్యాయవాది గొందేసి శ్రీనివాసులు రెడ్డి సహకారంతో శబరిమల యాత్ర చేసినట్లు ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ ట్రేడ్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు (అను) తెలియజేశారు. శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాబోయే రోజుల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పేదల కష్టాలు తీరుతాయని, ప్రతి పేదవాడు ఉన్నతంగా చదువుకోవాలన్న, పేదల సంక్షేమం కోసం జగన్ ముఖ్య మంత్రి కావాలని అయ్యప్ప స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి రూరల్ ఇంచార్జ్ మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నాయకత్వంలో పనిచేయడం ఆనాటి జక్కంపూడి రామ్మోహన్ రావు నాయకత్వంలో పనిచేసినట్లుగా ఉందని ముద్దల అను తెలిపారు. చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ నియోజవర్గంలో పార్టీ కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా పనిచేస్తున్నారన్నారు. జగన్ నాయకత్వంలో రాజమండ్రి రూరల్ లో వచ్చే సారి విజయ పతాకం ఎగరవే స్తామని ముద్దాల విశ్వాసం వ్యక్తం చేశారు.

## యర్రవరం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం.




**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 21:** మండల పరిధి

యర్రవరం గ్రామంలో సర్పంచ్ బీసెట్టి అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు వర్మ,ఆధ్వర్యంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కార్యక్రమం లో భాగంగా తీమ్5- క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం లో భాగంగా గ్రామంలో అభయాంజనేయ స్వామి గుడి వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద, గ్రామంలో పలు వీధుల్లో గ్రీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీవో రవికుమార్ వర్మ ముఖ్య అతిధిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు,క్లాప్ మిత్రాలు, వి ఓ లు పలువురు నాయకులు ముందుగా వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం మండల వ్యాప్తంగా వచ్చిన గ్రీన్ అంబాసిడర్ లతో

గ్రామంలో పలు ప్రాంతాలలో జీరో వెస్ట్ సేకరణ కార్యక్రమం చేపట్టారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీఓ ,డిప్యూటీ ఎంపీడీఓ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏలేశ్వరం వెలుగు కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్ (పారిశుద్ధ్య కార్మికులు) కు శిక్షణా తరగతులకు నిర్వహించనున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వా. ప్రసాద్,మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంఠ, బండారు సూరిబాబు ,పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఆర్ వీరబాబు, వివోలు పారిశుధ్య కార్మికులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వై రామవరం లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 21 :** మండల కేంద్రమైన వైరామవరంలో శుక్రవారం ఉదయం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

గ్రామాల పరిశుభ్రతలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలోఉన్న పంచాయతీలలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలు, గ్రీన్ గార్డ్స్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, వార్డ్ మెంబర్లు, వివో ప్రెసిడెంట్,ఎస్ హెచ్ జి లీడర్స్, డిప్యూటీ ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, పేకట్టి ఎం రాజ్ కుమార్, సామర్లకోట నుండి ఈటిసి ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపారు.

# పలు భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్న ముదునూరి మురళి కృష్ణంరాజు







**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 21 :** నియోజకవర్గ వైయస్సార్‌సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు శుక్రవారం ప్రత్తిపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాచపల్లి గ్రామంలో చిన్న సారిపల్లి వారి గంగాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన మహోత్సవంలో పాల్గొన్న మురళిరాజు అన్నదాన కార్యక్రమం కోసం 5 వేల రూపాయలు విరాళం అందజేశారు. ధర్మవరం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రారంభమైన చతుర్ద సప్తాహ మహోత్సవాల మొదటి రోజుకు కమిటీకి వారికి 8 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నానిబాబు, వోమ్మి వెంకటరమణ, గొర్రెల రాంబాబు, నార్పిరెడ్డి వీరబాబు, ద్రాక్షరపు సత్తిబాబు, సమాన శివాజీ, ఎంపీటీసీ నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, గంగాలమ్మ కమిటీ సభ్యులు మరియు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధి, భక్తి కార్యక్రమాల ప్రోత్సాహం, గ్రామీణ ప్రజలతో అనుబంధం పెంపొందించడంలో భాగంగా మురళిరాజు పర్యటనలు కొనసాగుతాయని స్థానిక నాయకులు తెలిపారు.

## పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వండి: ఆర్డీవో శ్రీకర్





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు21:**పుస్తకాలను ఇష్టంతో చదవడం వల్ల జ్ఞానం, మనోవికాసం పెరుగుతాయని,అందుకే ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్నిఅలవాటు చేసుకోవాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పి. శ్రీకర్ సూచించారు. కొత్తపేట శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్ మాట్లాడుతూ టీవీ,సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి పుస్తకాలకు సమయం కేటాయించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ,ఆటలతో పాటు తల్లి సూచన ప్రకారం'బారిష్టర్ పార్వతీశం'పుస్తకం చదివినట్లు,ఆ పుస్తకం తనలో మంచి ఆలోచనలను పెంపొందించిందని చెప్పారు.గ్రంథ పఠనం విద్యార్థులలో విజ్ఞానం,ఆలోచనా శక్తిని పెంచుతుందనీ,అందుకే పఠనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం గ్రంథ పాలకురాలు సునీత, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్. వీరన్న, జాయింట్ సెక్రటరీ కూచి మంచి సుధాకర్, రిటైర్డ్ లైబ్రేరియన్ చామకూర నాగేశ్వరరావు తదితరులు ఆర్డీవో శ్రీకర్‌ను దుస్సాలు,పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట తహసీల్దార్ వై. రాంబాబు,వీఆర్వోలు వీరేంద్ర,ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం,కె. శ్రీనివాస్,కుసుమ అనూష, లలిత తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం గా ప్రభుత్వం చర్యలు

గోదావరిలో చేప,రొయ్య పిల్లలను వదిలిన కలెక్టర్ కీర్తి చేకూరి , ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21**
ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ధవళేశ్వరం కంచర్ల ఘాట్ వద్ద గోదావరిలో 50 లక్షల చేపపిల్లలు, 5 లక్షల రొయ్యపిల్లలను విడుదల చేశారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, మత్స్యకార కుటుంబాల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్యమని తెలిపారు. చేపల వనరుల పెంపుతో పాటు, లైసెన్స్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయడం తో ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 4 వేల మంది వేట వృత్తిలో ఉన్నప్పటికీ, అనేక మంది లైసెన్స్ లేకుండా పని చేస్తుండటాన్ని గుర్తించామన్నారు.
ఈ నెలాఖరులోగా ప్రతి మత్స్యకార కుటుంబం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే దిశగా మత్స్య, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయంలో రూ.120 (బోట్, నెట్), రూ.50 (విసురవల) ఫీజుతో లైసెన్స్ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, లైసెన్స్ పొందినవారికి గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అన్నారు. సభాధ్యక్షులు, రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, దేశంలో చేపల ఉత్పత్తిలో 25.64% , రొయ్యల ఉత్పత్తిలో 75% ఆంధ్రప్రదేశ్ నుండి వస్తుందని తెలిపారు. వ్యవసాయంతో పాటు సమాన ప్రాధాన్యంతో ఆక్వా రంగాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్ర జీడీపీ , ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మత్స్యకారుల జీవనాధారాన్ని కాపాడేందుకు చేపలు పెరిగే కాలంలో వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామని బుచ్చయ్య చౌదరి తెలియ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ మత్స్యకారుల సహకార సంఘ ఇద్దరు అధ్యక్షులకు సత్కారం,ఫిష్ సీడ్ ఫామ్, మొంత తుఫానులో ఉత్తమ సేవలను అందించినందుకు ఉత్తమ గ్రామ మత్స్య సహాయకులకు సత్కారం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లో యుజి , పిజీ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ విజయవంతంగా పూర్తి చేసిన 30 మందికి సర్టిఫికెట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, జేడీ ఫిషరీస్ ఎన్. నిర్మలా కుమారి, మత్స్య కారులు స్థానిక ప్రజా ప్రతినిధులు మండల నాయకులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందురి అప్పారావు, పుక్కళ్ల రాజు, తలారి మూర్తి, ఎడ్ల మహేష్, గుర్రాల వెంకట్రావు, ఆళ్ల ఆనందరావు, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయితీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ సేవకులు, కైలాస భూముల నిర్మాత పట్టపగలు కు సతీ వియోగం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ నవంబర్ 21, :** సంఘ సేవకులు, కైలాస భూముల నిర్మాత పట్టపగలు వెంకట్రావు సతీమణి శ్రీమతి పట్టపగలు అనంత రామలక్ష్మి, శుక్రవారం ఉదయం నోటి క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ విశాఖపట్నం అపోలో హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు. శ్రీమతి అనంత రామలక్ష్మి 1954 సంవత్సరం జనవరి నెలలో ముమ్మిడివరం గ్రామం లోని మండే వెంకట్రావు, శ్రీమతి అచ్చియమ్మ దంపతులకు ముగ్గురు సంతానం లో ప్రథమ కుమార్తెగా జన్మించారు. శ్రీమతి అనంత రామలక్ష్మి మెట్రిక్ వరకు చదువుకున్నారు. తర్వాత 1969 వ సంవత్సరంలో వేమగిరికి చెందిన పట్టపగలు వెంకట్రావు తో వివాహము జరిగినది. ఈ దంపతులకు నలుగురు ఆడపిల్లలు కాగా శ్రీమతి అనంతలక్ష్మి సంఘ సేవలో ముందు ఉంటూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి తరపున ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ గా పనిచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సొంతంగా అనంత సేవానికేతన్ సంస్థ ను స్థాపించి బొమ్మూరులోని బబ్బర్ సింగ్ కాలనీలో గృహ నిర్మాణాలు జరిపారు. నగరం లో మంగళవారం పేట లోని మున్సిపల్ స్కూలును దత్తత తీసుకుని భవనాలు నిర్మించి ఫర్నిచర్, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ లు అందజేశారు. సంఘ సేవలో భర్త పట్టపగలు వెంకట్రావుకు చేదోడు వాదోడుగా ఉంటూ శ్రీమహకాళే శ్వరాలయం నిర్మాణంలో పాలుపంచు కున్నారు. అనంతసేవానికేతన్ నుంచి సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులను, ప్రముఖులను గుర్తించి అనంత సేవా పురస్కారాలను ప్రధానం చేసేవారు. శ్రీమతి అనంతలక్ష్మి పార్థవ దేహాన్ని విశాఖపట్నం నుంచి శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు మల్లిన నగర్ లోని స్వగృహం వద్దకు చేరుతుంది. ప్రజలు, బంధువులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం శనివారం ఉదయం 11 గంటల వరకు ఉంచి నగరంలోని ఇన్నీస్ పేటలోని రోటరీ కైలాసభూంలో పంచ క్రియలు జరుపుతారు. అనంతలక్ష్మి మృతి వార్త తెలిసి పలువురు నగర ప్రముఖులు , యాదవ సంఘాల పెద్దలు పట్టపగలు వెంకట్రావు ను సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఎస్సీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల ను వేధిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21:**స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉన్న ఎస్ సి కాలేజీ బాయ్స్ హాస్టల్ నె%శీ%:1 విద్యార్థులకు సరియైన భోజనం పెట్టలేదని , కాలేజీ కు వెళ్లే సమయానికి బ్రేక్ ఫాస్ట్ పెట్టలేదని అడిగినందుకు విద్యార్థులను వేదిస్తున్న వార్డెన్ కె ప్రభావతి విద్యార్థులను వేదిస్తున్నరని బి.ఎస్.పి జిల్లా ప్రెసిడెంట్ పట్నాల విజయ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ నక్కా వెంకటరత్నం రాజు ఆరోపించారు.
అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్, జిల్లా సోషల్ వెల్ఫేర్ హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని నగర బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు.
శుక్రవారం స్థానిక బహుజన పార్టీ కార్యాలయం లో జరిగిన సమావేశంలో నాయకులు డిమాండ్ చేసారు. గత రెండు మూడు నెలలనుండి స్థానిక కాలేజీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ కె. ప్రభావతి విద్యార్థులకు సరియైన భోజనం పెట్టకుండా ఇబ్బంది పెడుతుంద ని, విద్యార్థులు అడిగితే వారిపై పోలీస్ స్టేషన్లో కేసులు పెడుతున్నారని విమర్శించారు. దళిత విద్యార్థులని చూడకుండా విద్యార్థులను వేదిస్తున్నారని పై అధికారుల వద్ద కు న్యాయం చేస్తారని వెళితే హాస్టల్ వార్డెన్లను ఆఫీస్ కి పిలిపించి బెదిరించి భయభ్రాంతులకు గురించేస్తున్నారని ఆరోపించారు. దళిత విద్యార్థులకు రక్షణ కరువైందని వాపుతున్నారు. పోలీస్ స్టేషన్ కు పిలిచి వార్డెన్ కి
సరియైన భోజన సదుపాయాలు కల్పించాలని సూచన చేసిన రోజు నుండి ఇంకా వేధింపులు ఎక్కువైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 17న పై విషయాన్నీ కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ కి పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ వేధింపులపై విచారణ జరిపించి సదరు వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ అర్బన్ ఇంచార్జ్ ఇసుకపట్ల రాంబాబు కలక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ విచారణ లో విద్యార్థులను బెదిరించకుండా ఉండేందుకు తమను కూడా విచారణలో భాగం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో బి.ఎస్.పి జిల్లా ప్రెసిడెంట్ పట్నాల విజయ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ నక్కా వెంకటరత్నం రాజు, కొల్లాటి అబ్బులు, కొండపల్లి సూరిబాబు, కొనాల లాజర్, మొర్త మోహన్ కృష్ణ, మొర్త రామ్ మోహన్, కొత్తపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఈ నెల 22న ఉపాధి హామీ పై గ్రామ సభలు

– డ్వామా పిడి ఎమ్ నాగ మహేశ్వర రావు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21**
జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 22వ తేదీన ఉపాధి హామీ పథకం పై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగ మహేశ్వర రావు శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవడం ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖా స్తులను స్వీకరించి మంజూరు చేయాలని, ఇటీవల ఈ%-%కెవైసీ సమస్యల కారణంగా రద్దైన లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి శ్రామికులు , గ్రామ ప్రజలు ఈ గ్రామ సభల్లో పాల్గొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# వాడపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 21:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అభివృద్ధి పనులు వేగం పందుకోనున్నాయి. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పలు పనులకు శుభారంభం చేశారు. స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని మరో అనుకూల ప్రదేశంలో పునరావస్థాపన చేసే పనులు ప్రారంభించారు.తరువాత ఆలయ పరిసరాల్లో ఉన్న సమస్యలు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూ లైన్ల ఏర్పాటు, సౌకర్యాల విస్తరణపై అర్చకులతో అధికారులు సమీక్షించారు. భక్తులందరికీ మరింత మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

# కేడర్ లో కుమ్ములాటలు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అమలు చేయడంపై దృష్టి సారిస్తుంటే.. నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు కొట్టుకుంటున్నారు. అనేక నియోజకవర్గాల్లో టీడీపీలో గ్రూపులు బయలుదేరాయి. కొత్తగా చేరిన వారికి, పాతగా వచ్చిన వారికి మధ్య గ్యాప్ ఏర్పడింది. ఎన్నికయిన ఎమ్మెల్యేల తప్పిదం కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన కొందరికే కాంట్రాక్టు పనులతో పాటు నామినేటెడ్ పదవులను ఇస్తుండటంతో ఇక దక్కని వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని భావించినా అది సాధ్యం కావడం లేదు. మత్రి నారా లోకేశ్ కు ఈ విషయం చెప్పాలనుకున్నా అందుకు సమయం చిక్కడం లేదు..దీంతో అనేక నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. పార్టీ అగ్ర నాయకత్వం తప్పిదం లేకపోయినా స్థానిక నాయకత్వం కారణంగానే ఇటువంటి తప్పిదాలు, విభేదాలు ఎక్కువవుతున్నాయని తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. నియోజకవర్గంలో తాము పడుతున్న ఇబ్బందులు పార్టీ హైకమాండ్ దృష్టికి వెళతాయని వారు సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. దీంతో పార్టీ పరువు రోడ్డున పడుతుంది. అంతే కాదు.. సోషల్ మీడియాలో పడుతున్న వాటిని మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం కూడా చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడం లేదన్న ఆరోపణలు కూడా చేస్తున్నారు. అసంతృప్తిని కప్పి ఉంచితే అది ఎన్నికల సమయానికి బయటపడుతుందన్న భావన టీడీపీ అభిమానుల్లో వ్యక్తమవుతుంది. తాజాగా సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను ఆ పార్టీ కార్యకర్త నూతలపాటి హరిప్రసాద్ చౌదరి చేసిన పోస్టు వైరల్ గా మారింది. అతని పోస్టును చూసి చాలా మంది కార్యకర్తలు తమ నియోజకవర్గంలోనూ ఇంతేనని కామెంట్స్ పెడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం ఉన్నప్పటికీ అక్కడ హేమలత, గంగాప్రసాద్, నరసింహయాదవ్, మునస్వామియాదవ్, పద్మరాజు నాటి తిరుగుబాటు అభ్యర్థి చెరుకురసం రమేష్ బాబులు పార్టీలో పనిచేసిన వారికి అన్యాయం చేస్తున్నారని హరిప్రసాద్ చౌదరి ఆరోపించారు. పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా అధిష్టానం నిర్ణయించిన శంకర్ రెడ్డి టీడీపీ ఓటమి కోసం పనిచేసిన వారిని పక్కన కూర్చొని పెట్టుకొని వారికి ప్రాధాన్యం ఇస్తూన్నారన్నారు. దీంతో పార్టీ కోసం నిజంగా కష్టపడ్డ నాయకుల్లో కష్టాలు అంతర్మధనం ప్రారంభమై తిరిగి గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయనిచెప్పారు. ఇదే పరిస్థితి అనేక నియోజకవర్గాల్లో నెలకొందని అనేక మంది సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# మార్చి 15 నుంచి టెన్త్ ఎగ్జామ్స్



బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

పదోతరగతి పరీక్షలను మార్చి 15 లేదా 21 నుంచి నిర్వహించడానికి విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈసారి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. పూర్తి సాంకేతికత వాడుకొని ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. పరీక్ష సెంటర్ నిర్ణయం నుంచి సిబ్బంది నియామకం వరకు అన్నింటినీ అమరావతి నుంచి చేపట్టనున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇంటర్ ప్రాక్టికల్స్‌కు, పండగలతో పదోతరగతి విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది రాకుండా పరీక్షల షెడ్యూల్‌ను నిర్ణయించనున్నారు. అందుకే మార్చి 16 లేదా 21 తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. 11 రోజుల పాటు జరిగే పరీక్షలకు ఆదివారం మినహా వేరే రోజు సెలవు రాకుండా ప్లాన్ చేస్తున్నారు.పదో తరగతి పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇవాళ రేపు విడుదల చేసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. పరీక్షల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సాఫీగా టెన్షన్ లేకుండా పరీక్షలు రాసుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. సెంటర్‌కు సులభంగా చేరుకునేలా సాంకేతికతను వాడుకోనున్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్ష సెంటర్ అడ్రెస్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా హాల్‌టికెట్‌పై ముద్రిస్తారు. దీంతో సెంటర్‌కు ఈజీగా చేరుకొనేలా ప్లాన్ చేస్తున్నారు. పరీక్ష కేంద్రం ఎంపిక నుంచి సిబ్బంది నియామకం వరకు అన్నింటినీ ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారులు పర్యవేక్షించే వాళ్లు. ఇప్పుడు ప్రభుత్వ పరీక్షల డైరెక్ట్ విభాగం వీటిని పర్యవేక్షిస్తోంది. రాష్ట్ర స్థాయి నుంచే కేంద్రం, కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బందిని నియామకం చేపడతారు. పరీక్షలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న పాఠశాలలను ముగ్గురు ఉన్నతాధికారుల టీం పరిశీలిస్తుంది. అక్కడ ఉండే పరిస్థితులు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేస్తుంది. అన్నీ అనుకూలంగా ఉంటే వారికి పరీక్ష కేంద్రం అనుమతి ఇస్తుంది. పదో తరగతి పరీక్షల టైంలోనే ఇంటర్ ప్రాక్టికల్స్ ఉన్నందున జూనియర్ కాలేజీలలో సెంటర్ ఇవ్వకూడదని నిర్ణయించారు. ఒక్క పరీక్ష కేంద్రాల ఎంపిక మాత్రమే కాకుండా పరీక్షలు సజావుగా సాగేందుకు సిబ్బంది నియామకం కూడా నేరుగా రాష్ట్ర స్థాయి నుంచే చేపడతారు. చీఫ్ సూపరింటెండెంట్లు, విభాగ అధికారులు, ఇన్విజిలేటర్లు అందర్నీ కూడా డీజీఈ కార్యాలయం నుంచే నియమిస్తారు. గ్రేడ్–2 హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఇతరుల వివరాలను ఆన్‌లైన్‌లో తీసుకుంటారు. వాటి ఆధారంగా నియామకాలు చేపడతారు. వాటిని ఆయ పాఠశాలలకు పంపిస్తారు. మరోవైపు తీసుకొని ఎంపిక చేసి, వాటి జాబితాలను జిల్లాలకు పంపనున్నారు.

# జనం ఉంటేనా బయిటకు వస్తారా...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

జగన్మోహన్ రెడ్డి తన తీరు మార్చుకోవడం లేదు. తాను ఇంటి నుంచి బయటకు వస్తే జనం ఉండాల్సిందేనని చెబుతున్నారు. అది మృతుల కుటుంబాలకు పరామర్శకు వెళ్లినా.. లేకుంటే కోర్టు కేసులకు హాజరైనా.. బల ప్రదర్శన తప్పదు. చివరకు జైల్లో ఉన్న తమ వారిని పరామర్శించేందుకు వెళ్లినా అక్కడ జగన్ మామయ్య అంటూ గుక్క తిప్పుకునే ఏడ్చే సీన్లు ఉండాల్సిందే. ఎందుకంటే తాను ఎలివేట్ కాలేనన్న ఆందోళన జగన్మోహన్ రెడ్డిలో నిత్యం ఉంటుంది. అయితే తాజాగా ఆయన ఈరోజు హైదరాబాద్ వెళ్లారు. చాలా రోజులకు సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఎక్కడికక్కడే జన సమీకరణ స్పష్టంగా కనిపించింది. చక్కటి చిరునవ్వుతో చేతులెత్తి నమస్కరిస్తూ వారిని ఉత్తేజపరిచారు జగన్మోహన్ రెడ్డి. తాను కోర్టుకు వెళుతున్నాం అన్న విషయం కూడా మరిచిపోయి చిరునవ్వుతో.. వెకిలి నవ్వుతో వారిని ఉత్తేజపరిచారు.ఎందుకో జగన్మోహన్ రెడ్డి జనాన్ని మరిచిపోలేకపోతున్నారు. జనం లేకపోతే తన నాయకత్వం మరింత బలహీనం అవుతుందని భావిస్తున్నారు. దానికి కారణాలు లేకపోలేదు. ఎందుకంటే జనం సెంటిమెంటు నుంచి పుట్టిందే ఆయన పార్టీ. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో,

అంతులేని సానుభూతి ఉన్న సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాదులు వేశారు జగన్మోహన్ రెడ్డి. అదే సెంటిమెంట్తో గోడలు కట్టారు. అడ్డగోలుగా స్లాబ్ కూడా వేశారు. ఇప్పుడు అందులో నిరంతరాయంగా నివాసం ఉండేందుకు అదే సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. అందులో భాగమే తాను ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టిన మరుక్షణం జనం కనిపించాలన్న తపన ఆయనది. కానీ జనం దానిని కోరుకోవడం లేదు. జనం ఆలోచన అంతా గడిబిడి వాతావరణం కాదు. చాలా పీస్ ఫుల్ గా ఆలోచిస్తున్నారు ఏపీ ప్రజలు. దానిని గుర్తించలేని స్థితిలో ఉన్నారు జగన్మోహన్ రెడ్డి.ఒక ప్రభుత్వం ఎలా నడపాలో జగన్మోహన్ రెడ్డిని చూసి నేర్చుకోవచ్చు. అయితే ఆయన గొప్పలా పాలించారు అని చెప్పడం లేదు కానీ. జగన్ లా పాలించకపోవడం అసలైన పాలన. ఇప్పుడు చంద్రబాబుచేస్తోంది అదే. జగన్మోహన్ రెడ్డి మాదిరిగా హడావిడి లేదు. బయటకు వెళితే జన సమీకరణ లేదు. కేవలం ఒక్కరే చంద్రబాబు వాహనంలో వెళ్తున్నారు. ఒకే ఒక్క గ్రామ ప్రజల మధ్య పథకాలను ప్రారంభిస్తున్నారు. పవన్ కళ్యాణ్ సైతం ఒంటరిగానే అడవికి వెళ్తున్నారు. రక్షణగా మందీ మార్బలం లేదు. ప్రభుత్వంలో ఉన్నామన్న దర్పం లేదు. అధికార పార్టీ వారు సింపుల్ గా ఉన్నారు. అధికారం నుంచి ప్రతిపక్షంలో మారిన వారు మాత్రం అదే దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈరోజు జగన్ హైదరాబాదులో అడుగుపెట్టిన మరుక్షణం భాగ్యనగరం ప్రజలకు చుక్కలు కనిపించాయి. అయితే జై కొట్టిన జనానికి ఇది కనిపించలేదు. జై కొట్టిన వారికి కనిపించలేదు. ఎటొచ్చి మిగతా ప్రజలే ఛీ కొడుతున్నారు.

# జగన్ కు బ్యాడ్ టైమేనా

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై నమోదయిన కేసుల విషయం చివరి దశకు చేరుకున్నట్లే కనిపిస్తుంది. ఇప్పుడు బీజేపీ కూడా జగన్ కు సాయం చేసే పరిస్థితుల్లో కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా అధికారంలో రాకపోయినా దానికి టీడీపీ, జనసేన అండగా ఉంది. అందుకే జగన్ ను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టే అవకాశాలున్నాయని అనేక మంది సీనియర్ రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ వల్ల బీజేపీకి ప్రత్యక్షంగా ప్రయోజనం ఉండదు. అలాగని ఇప్పటి వరకూ నష్టం లేదు. పరోక్షంగా జగన్ తమకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాడు. ఆ ఒక్క కారణంతోనే ఇన్నాళ్లు కేసుల విషయంలో చూసీ చూడనట్లు భారతీయ జనతా పార్టీ వ్యవహరించిందంటున్నారు. ఇప్పటి వరకూ ప్రధాని నరంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆశీస్సులు జగన్ కు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి ఇన్ని సార్లు వచ్చినా జగన్ ను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. జగన కూడా రాష్ట్రంలో తన ప్రత్యర్థి పార్టీలు బీజేపీతో జత కట్టినా బీజేపీని ఒక్క మాట అనడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఏం అవసరమొచ్చినా కమలం పక్కనే నిలబడుతున్నారు. కాంగ్రెస్ తనకు ప్రధాన శత్రువు కావడంతో బీజేపీకి మద్దతు ఇస్తుండవచ్చు. అందుకే ఏ బిల్లు విషయంలోనైనా,రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనైనా జగన్ నేరుగానే మద్దతిచ్చి మోదీ కి ఇష్టమైన వ్యక్తిగా మారాడు. అలాగే బీజేపీ విషయంలో ఒక్క విమర్శ కూడా చేయకుండా జాగ్రత్త పడుతున్నారు. కానీ బీజేపీ తన వైఖరి మార్చుకోవడానికి అనేక కారణాలుంటాయి. బీజేపీకి కూడా దక్షిణాదిన అందులో ఆంధ్రప్రదేశ్ లో తమ బలం పెంచుకోవడం అవసరం. అది జగన్ వల్ల సాధ్యం కాదు. కూటమితో ఉంటే సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. అధికారంలో ఒక రాష్ట్రంలో ఉన్నామన్న సంతృప్తి పొందవచ్చు. కానీ జగన్ వల్ల రాజకీయ ప్రయోజనం కొన్నింటికే పరిమిమై ఉంటుంది. ఈ విషయం గ్రహించిన బీజేపీ తన పంథాను మార్చుకోవచ్చన్న సూచనలు బలంగా అందుతున్నాయి. తమకు జగన్ కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తే జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పవన్న సంకేతాలు ఇప్పటికే వస్తున్నాయి. జగన్ నేడు సీబీఐ కోర్టుకు కొన్నేళ్ల తర్వాత హాజరవ్వడాన్ని కూడా ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. అందుకే జగన్ కు రానున్నకాలం కష్టకాలమేనని ఖచ్చితంగా చెప్పొచ్చు.

# బోర్డర్స్ లో అడగడుగునా నిఘా

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



.ఆంధ్రా–ఒడిశా బోర్డర్.. షార్ట్‌కట్‌లో ఏవోబీ. ఈ ప్రాంతంలో మావోయిస్ట్‌ల కదలికలు..గత చరిత్ర అని ఇంతవరకూ భావించారు ఏపీ పోలీసులు. అయితే వరుసగా రెండు రోజులు జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లు.. పోలీసుల ఆలోచనను మార్చేశాయి. దీంతో ఏవోబీలో ఇకపై నో మోర్ గేమ్స్ అంటూ వేట మొదలుపెట్టారు.వరుస ఎన్‌కౌంటర్లు.. మావోయిస్ట్ అగ్రనేతల కదలికలతో %ఆూదీ%లో మళ్లీ హైటెన్షన్ మొదలయింది. రెండు రోజుల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ హిడ్మా సహా ఆరుగురు మవోయిస్ట్‌లు హతం కాగా.. మరునాడు బుధవారం ఉదయం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో టెక్ శంకర్‌తో పాటు మరో ఆరుగురు మావోయిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఏపీలోని వివిధ జిల్లాల్లో తలదాచుకున్న మరో 50 మంది మావోయిస్టులు పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ఏపీలో మళ్లీ హైటెన్షన్ మొదలయింది. ఏవోబీని షెల్టర్‌జోన్‌గా మార్చుకోవడానికి మావోయిస్టులప్రయత్నిస్తున్నారని..అందుకోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిని రిక్రూట్‌మెంట్ చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఏపీలోకి తరలిరావడంతో పోలీసుల నిఘా ఒక్కసారిగా పెరిగింది. ఏవోబీతోపాటు తూర్పు గోదావరి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతాల్లో భారీగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోనూ మావోయిస్టులు ఉన్నారేమోనన్న అనుమానంతో హైఅలర్ట్ ప్రకటించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఏపీవైపు మావోయిస్ట్‌లు చొరబడకుండా పటిష్ట నిఘా వేసినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు.2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలన్న కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలతో 2024 జనవరి నుంచి దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' మొదలైంది. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. 2014లో 126 జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండగా.. 2024 నాటికి 38 జిల్లాలకు తగ్గిపోయింది. ఆ తర్వాత ఏడాదిన్నర వ్యవధిలోనే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్, నారాయణపూర్, సుక్మా, జార?ండ్‌లోని వెస్ట్‌సింగ్ భూమ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు మాత్రమే మావోయిస్టు పార్టీ పరిమితమైంది. దీంతో ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న మావోయిస్టులు.. సేఫ్‌జోన్ కోసం పట్టణాలు, నగరాల బాట పట్టారు. ఈ క్రమంలో అలెర్ట్ అయిన ఏపీ పోలీసులు.. మావోయిస్ట్‌లకు బోర్డర్‌లోనే

# క్షేత్రస్థాయి సంగతేంటీ... పవన్

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



జనసేన పార్టీ సంస్థాగతంగా ఆంధ్రప్రదేశ్ లో బలంగా లేదు. పవన్ కల్యాణ్ క్రేజ్.. ఇమేజ్ మీదనే అది ఆధారపడి ఉంది. అయితే మొన్నటి వరకూ ఒక ఎత్తు. పవన్ కల్యాణ్ ను పవర్ లో ఎవరూ చూడలేదు. అధికారంలో లేనప్పుడు ఉండే క్రేజ్ కంటే అధికారంలో ఉన్నప్పుడు ఉండే ఇమేజ్ కు చాలా తేడా ఉంటుంది. మైండ్ సెట్ లోనూ నాయకుల్లో మార్పు వస్తుంది. అధికారంలోకి రాకముందు ప్రశ్నించడానికే వచ్చామంటారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించడమే మానేస్తారు.క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకుంటేనే పార్టీ మనుగడ సాధ్యమవుతుంది. ఈ విషయం అనేక రాష్ట్రాల్లో అనేక మంది విషయాల్లో వెల్లడయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.ఉపముఖ్యమంత్రిగా మాత్రం... జనసేన అధినేతగా పవన్ కల్యాణ్ నిజాయితీ పరుడే.ప్రశ్నించే తత్వం ఉన్న నాయకుడే. కానీ ఉప ముఖ్యమంత్రిగా ఆయన నోరు విప్పితే ప్రతిపక్షంపైనే విరుచుకుపడుతున్నారని, అధికార పార్టీ నేతల అరాచకాలను ప్రశ్నించలేకపోతున్నారన్న ఆవేదన, ఆక్రోశం క్యాడర్ లోనూ, కాపు సామాజికవర్గంలోనూ ఉంది. అనేక విషయాల్లో పవన్ కల్యాణ్ మౌనంగా ఉండటం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో జనసేన నేతలను, క్యాడర్ ను ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తాము కష్టపడి పనిచేసిన దానికి ఫలితం లేకుండా పోయిందన్న ఆవేదన, నిరాశ, నిస్పృహలు పార్టీ ముఖ్య కార్యకర్తల్లోనూ, పవన్ వీరాభిమానుల్లోనూ వ్యక్తమవుతున్నాయి.కూటమి పార్టీలు కలసి ఉంటే గెలుస్తామని బిందాస్ గా కూర్చోవడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. గత ఎన్నికల్లో అందరం కలసి పనిచేస్తేనే హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ వచ్చిందని, ఇప్పుడు వందకు పైగా నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన పనిచేసే పరిస్థితులు లేవన్నది పవన్ కల్యాణ్ గుర్తిస్తే మంచిదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరిగి రెండేళ్లు కాకముందే ఈ పరిస్థితి ఉంటే రాను రాను ఇది మరింత పెరుగుతుందని, అది పార్టీకి నష్టం చేకూరుతుందని కొందరు పార్టీ అభిమానులు సోషల్ మీడియా వేదిక ద్వారా వార్నింగ్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికైనా నియోజకవర్గాల్లో క్యాడర్, నేతల విషయంలో సీరియస్ యాక్షన్ కు దిగాల్సిందేనని పట్టుబడుతున్నారు. మరి ఏం జరుగుతందో చూడాలి.

# వ్యక్తిగతంగా తీసుకుంటున్న నేతలు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఒకప్పుడు రాజకీయాలు హుందాగా ఉండేవి. నేతల మధ్య సంబంధాలు కూడా అదే స్థాయిలో ఉండేవి. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు ఆస్కారం ఉండేది కాదు. పైగా నేతలు రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కొనసాగించేవారు. మిగతా సందర్భాలలో మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇష్టపడేవారు.ఇప్పటి కాలంలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. రాజకీయాలను వ్యక్తిగత అంశంగా మార్చుకోవడం వల్ల నేతల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటున్నది. వ్యక్తిగత అంశాలను కూడా రాజకీయ నాయకులు వివిధ వేదికల వద్ద ప్రస్తావించడం.. కుటుంబ సభ్యుల వ్యవహారాలను కూడా బయటపెడుతుండడంతో రాజకీయాలు అంటేనే ఇబ్బందికరంగా మారిపోయాయి. నేతల భాష కూడా అత్యంత దారుణంగా ఉంటున్నది. ఇవన్నీ కూడా నేటి రాజకీయాలలో పతనమవుతున్న విలువలకు దర్పణంగా నిలుస్తున్నాయి. ఇలాంటి రాజకీయాలు ఇంకా ఎంతకాలం కొనసాగుతాయి.. ఇవన్నీ ఎక్కడ వరకు దారి తీస్తాయి అనే ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు.తెలంగాణ రాజకీయాలలో ప్రస్తుతం కేటీఆర్ రేవంత్ రెడ్డి మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. ఇద్దరు నేతలు నువ్వా నేనా అన్నట్టుగా విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్ ను కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శిస్తే.. దానికి రెట్టింపు స్థాయిలో రేవంత్ కేటీఆర్ ను విమర్శించారు. అంతేకాదు రేవంత్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లలో ప్రధానంగా దృష్టి సారించారు. అక్కడ భూ అక్రమాలను బయటకు తీశారు. అయితే ప్రభుత్వం నియమించిన ఒక కలెక్టర్ వివాదాస్పదంగా వ్యవహరించడంతో రేవంత్ కాస్త ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరికి ఇటీవల ఓ మహిళ ఐఏఎస్ ను సిరిసిల్ల కలెక్టర్ గా నియమించారు. సిరిసిల్ల జిల్లాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇందులో రేవంత్ రెడ్డి ప్రమేయం ఉండడంతో అది కాస్త చర్చకు దారి తీసింది.. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందిరమ్మ చీరలను మహిళా సంఘాలకు పంపిణీ చేసే విషయంపై ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల కలెక్టర్ కూడా మాట్లాడారు. అయితే ఆమె ఇంగ్లీష్ లో మాట్లాడుతుండగా రేవంత్ రెడ్డి కల్పించుకున్నారు.

## సౌతాఫ్రికాతో సెకండ్ టెస్ట్.. గిల్ ఔట్..

# పంత్ చేతికి కెప్టెన్సీ పగ్గాలు

**సౌతాఫ్రికాతో కీలకమైన రెండో టెస్టుకు ముందు అభిమానులకు టీమిండియా చేదు వార్త చెప్పింది. తొలి టెస్టులో మెడ కండరాల నొప్పితో బాధపడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, డాక్టర్ల సూచన మేరకు ఈ మ్యాచ్?కు దూరమయ్యాడు. మ్యాచ్ సమయంలో మళ్లీ నొప్పి తిరగబెట్టే ప్రమాదం ఉన్నందున అతడిని ఆడించి రిస్క్ చేయకూడదని జట్టు మేనేజ్?మెంట్ నిర్ణయించింది. స్క్వాడ్ నుంచి తప్పించింది. సెకండ్ టెస్ట్ కెప్టెన్సీ పగ్గాలను రిషబ్ పంత్?కు అప్పగించింది. సౌతాఫ్రికాతో సెకండ్ టెస్ట్ శనివారం నుంచి మొదలు కానుంది. గిల్ ఆడే అవకాశం లేదని బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్ టీమ్ శుక్రవారం ప్రకటించింది.**




**హైదరాబాద్ పెన్ పవర్:** రిషబ్ పంత్ ఇండియా 38వ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ కీలక మార్పుతో పాటు తుది జట్టులో రెండు ముఖ్యమైన స్థానాలపై టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్రంగా కసరత్తు మొదలుపెట్టింది. గిల్ స్థానంలో రిజర్వ్ బెంచ్‌లోని లెఫ్టాండ్ బ్యాటర్లలో సాయి సుదర్శన్ వైపు మొగ్గు చూపుతుండటం గమనార్హం. తొలి టెస్ట్‌లో మూడో నంబర్‌లో మెరుగ్గా ఆడిన వాషింగ్టన్ సుందర్‌ను కొనసాగించి, సుదర్శన్‌ను ఆరో నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది.మరొక కీలక స్థానం స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, సీమ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి మధ్య పోటీగా మారింది. అక్షర్ పటేల్ మెరుగైన బ్యాటింగ్ చేయగలడు. కానీ పిచ్‌పై పచ్చిక ఉండి బౌన్స్?కు అనుకూలిస్తే రైట్ హ్యాండ్ బ్యాటర్ నితీష్ రెడ్డికి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా అవకాశం దక్కే చాన్స్ ఉంది. ఐదో బౌలర్‌గా నితీష్ రెడ్డి వస్తే పేస్ బౌలింగ్‌కు సపోర్ట్ లభించడంతో పాటు రైట్ హ్యాండ్ బ్యాటర్ల సంఖ్య కూడా పెరుగుతుందని టీమ్ మేనేజ్‌మెంట్ లెక్కలు వేస్తోంది. ఏదేమైనా తొలి టెస్ట్ ఓటమి తర్వాత సరైన కాంబినేషన్?ను ఎంచుకుని సిరీస్ సమం చేయడానికి ఇండియా వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది.

# స్మృతి మంధాన పెండ్లి.. వరుడి బ్యాక్ గ్రౌండ్ తక్కువ లేదుగా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా విమెన్స్ క్రికెట్ టీమ్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెండ్లి పీటలు ఎక్కనుంది. తాను చాన్నాళ్లుగా ప్రేమిస్తున్న మ్యూజిక్ కంపోజర్, సింగర్ పలాష్ ముచ్చల్‌ను పెండ్లి చేసుకోనుంది. ఈ నెల 23న ఈ ఇద్దరి మ్యారేజ్ జరగనుంది. మహారాష్ట్రలోని సాంగ్లీలో జరిగే ఈ గ్రాండ్ వెడ్డింగ్‌కు సినీ, క్రికెటర్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలుస్తోంది.

**రాజకీయ పుస్తకాలు**

ఇరు కుటుంబాలు పెండ్లికి సంబంధించిన ఏర్పాట్లలో మునిగిపోయాయి. నెల కిందటే ఇండోర్‌లో ఈ ఇద్దరి ఎంగేజ్‌మెంట్ జర్గగా.. ఈ విషయాన్ని స్మృతి ఇన్‌స్టా పోస్టులో ఇటీవలే వెల్లడించింది. స్మృతి – పలాష్ వెడ్డింగ్ కార్డు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# నేటి నుంచి టీమిండియాతో రెండో టెస్టు... దక్షిణాఫ్రికాకు గట్టి ఎదురుదెబ్బ

- **భారత పర్యటన మొత్తానికి దూరమైన కగిసో రబాడా**
- **పక్కటెముకల గాయంతో సిరీస్ నుంచి నిష్క్రమణ**
- **రబాడా స్థానంలో జట్టులోకి వచ్చిన లుంగి ఎంగిడి**
- **రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న సౌతాఫ్రికా**
- **నేటి నుంచి రెండో టెస్టు**
- **భారత్‌లో చివరిసారిగా 2000 సంవత్సవరంలో సిరీస్ గెలిచిన సఫారీలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇప్పటికే 1–0 ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడా గాయం కారణంగా రెండో టెస్టుకు కూడా దూరమయ్యాడు. పక్కటెముకల ఒత్తిడి గాయంతో బాధపడుతున్న అతడు.. గౌహతిలో జరిగే రెండో టెస్టుతో పాటు, ఆ తర్వాత జరగబోయే వైట్–బాల్ సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండదని క్రికెట్ సౌతాఫ్రికా ప్రకటించింది.

కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టుకు కూడా రబాడా దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడం, నొప్పి ఇంకా కొనసాగుతుండటంతో అతడిని సిరీస్ నుంచి తప్పిస్తున్నట్లు సీఎస్ఏ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. రబాడా స్థానంలో ఇప్పటికే లుంగి ఎంగిడిని జట్టులోకి తీసుకున్నారు. రబాడా నాలుగు వారాల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంటాడని, రెండో టెస్ట్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికాకు తిరిగి వెళతాడని సీఎస్ఏ వివరించింది.

రబాడా గైర్హాజరీతో గౌహతి టెస్టులో సౌతాఫ్రికా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. కోల్‌కతా టెస్టులో మొత్తం 8 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన స్పిన్నర్ సైమన్ హార్మర్ సఫారీ బౌలింగ్‌కు నాయకత్వం వహించాడు. అతడికి మరో స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌తో పాటు, పేస్ ఆల్‌రౌండర్లు మార్కో యన్‌సెన్, వియాన్ ముల్డర్, కార్బిన్ బాష్ సహకారం అందించారు.గౌహతి టెస్టులో గెలిచి 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలని టెంబా బవుమా సేన పట్టుదలగా ఉంది. చివరిసారిగా 2000వ సంవత్సరంలో హన్సీ క్రోన్యే కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది.



మస్తీ 4 ప్రీమియర్ కోసం రెడ్ కార్పెట్ లుక్‌లో ఎల్నాజ్ నోరౌజీ స్టన్స్

# కపూర్ బ్యూటీ మళ్లీ సర్‌ప్రైజ్


బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనమ్ కపూర్ మరోసారి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. 2018లో వ్యాపారవేత్త ఆనంద్ ఆహుజాను వివాహం చేసుకున్న సోనమ్ కపూర్ 2022లో మొదటి సారి తల్లి అయింది. ఆ సమయంలోనూ తాను తల్లి కాబోతున్నాను అంటూ సర్‌ప్రైజింగ్ ఫోటోలు షేర్ చేసింది. బేబీ బంప్‌తో సోనమ్ కపూర్ షేర్ చేసిన ఫోటోలు ఆ సమయంలో చర్చనీయాంశం అయ్యాయి. స్టార్ హీరోయిన్ తల్లి కాబోతుంది అంటూ తెగ ప్రచారం జరిగింది. మొదటి సారి బాబుకు జన్మనిచ్చిన సోనమ్ కపూర్ దంపతులు అతడికి వాయు అని పేరు పెట్టారు. వాయు ఇప్పుడు మూడు ఏళ్ల వయసు పిల్లాడు. ఇంతలోనే అతడు అన్న కాబోతున్నాడు అంటూ అధికారికంగా ప్రకటన వచ్చింది. వాయు అన్న కాబోతున్నట్లుగా అధికారికంగా సోనమ్ కపూర్ ఫోటోలు షేర్ చేసి మరీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రెగ్నెంట్...**

సోనమ్ కపూర్ పింక్ కలర్ డ్రెస్‌లో బేబీ బంప్‌తో ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగానే సెలబ్రిటీల యొక్క ప్రెగ్నెన్సీ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. కానీ సోనమ్ కపూర్ యొక్క సెకండ్ ప్రెగ్నెన్సీ పెద్దగా చర్చ జరగలేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ప్రెగ్నెన్సీ గురించి ప్రచారం జరగలేదు. దాంతో అసలు విషయం ఏంటో అనేది క్లారిటీ లేదు. ఇప్పుడు నోనమ్ కపూర్ నుంచి క్లారిటీ వచ్చింది. ఆమె బేబీ బంప్ తో ఫోటో షూట్ ఇచ్చింది. దాంతో ఒక్కసారిగా అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. సాధారణంగా అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరిగి ఆ తర్వాత విషయాన్ని కన్ఫర్మ్ చేస్తారు. కానీ సోనమ్ కపూర్ సెకండ్ ప్రెగ్నెన్సీ విషయం గురించి వార్తలు రాకపోవడంతో ఇప్పుడు అంతా సర్‌ప్రైజ్ అవుతున్నారు అనేది సోషల్ మీడియా కామెంట్స్‌ను చూస్తే అర్థం అవుతుంది.

**సోనమ్ కపూర్ హీరోయిన్‌గా**

హీరోయిన్‌గా సోనమ్ కపూర్ సినిమాలు గతంతో పోల్చితే తగ్గించింది. 2019 సంవత్సరం వరకు వరుస సినిమాలు చేసిన సోనమ్ కపూర్ పెళ్లి తర్వాత తగ్గించింది అనేది అభిమానుల కంప్లైంట్. హీరోయిన్‌గా సోనమ్ కపూర్ వరుస సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. కానీ ఆమె నుంచి మాత్రం సినిమాలు అంతగా రావడం



లేదు. 2023 లో బ్లైండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. అయినా కూడా నటిగా మంచి మార్కులు తెచ్చి పెట్టింది. ఆ వెంటనే ఒకటి రెండు సినిమా ఆఫర్లు వచ్చాయట. కానీ ఆమె మాత్రం సున్నితంగా తిరస్కరించిందని సమాచారం. రెండో ప్రెగ్నెన్సీ కారణంగా సోనమ్ కపూర్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. త్వరలోనే ఆమె రెండో బేబీకి జన్మనిచ్చిన తర్వాత సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

**అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్**

బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో అనిల్ కపూర్ కుమార్తె అయిన సోనమ్ కపూర్ మొదట్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసింది.

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన సావరియా సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. 2007 సంవత్సరంలో ఆ సినిమా విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దాంతో సోనమ్ కపూర్ వెనక్కి తిరిగి చూసుకోనవసరం రాలేదు. బాలీవుడ్‌లో దాదాపు అందరు స్టార్ హీరోలకు జోడీగా నటించడం ద్వారా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఎన్నో అవార్డులు, రికార్డ్‌లను సొంతం చేసుకున్న హీరోయిన్‌గానూ సోనమ్ కపూర్ నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగానూ సోనమ్ కపూర్ తన సినిమాలతో మెప్పించడం జరుగుతుంది. అందుకే ఈమె సినిమాలను అభిమానించే వారు చాలా మంది ఉంటారు. సెకండ్ ప్రెగ్నెన్సీ తర్వాత సోనమ్ మళ్లీ బిజీ కావాలని అంతా కోరుకుంటున్నారు. మరి ఆమె ఉద్దేశం ఏంటో చూడాలి.



లారిస్సా బోనేసి సొగసైన టీల్ గౌన్‌తో తల తిప్పింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com